PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 64 | విజయవాడ, బుధవారం 4 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 4 October 2023 | Rs

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- పియర్రె అగొస్తిని, ఫెరెంక్ క్రాయిస్జ్, అన్నె హుయిలర్‌లకు పురస్కారం

5





పారుల్, అనూకు స్వర్ణాలు

6

- లౌల్లీనాకు ఒలింపిక్ బెర్త్
- భారత్ ఖాతాలో మరో తొమ్మిది పతకాలు

స్వేచ్ఛకు సంకెళ్లు

- మీడియాపై మోడీ సర్కార్ ఉక్కుపాదం
- న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ సహా ఇద్దరు అరెస్టు

- 30 ప్రాంతాల్లో న్యూస్ పోర్టల్ కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లపై దాడులు
- ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు ఎత్తుకెళ్లిన ఢిల్లీ పోలీసులు
- ఎన్ఎజె, ఐజెయు, ఐలు తదితర సంఘాల ఖండన



ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేసి తీసుకెళ్తున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: కేంద్రంలో మోడీ ప్రభుత్వం స్వతంత్ర మీడియాపై మరోసారి ఉక్కుపాదం మోపింది. ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్ కార్యాలయంపైన, సిబ్బంది ఇళ్లపైన 30 చోట్ల ఢిల్లీ పోలీసులు మంగళవారం తెల్లవారు జాము నుంచి రాత్రి పొద్దుపోయే దాకా దాడులు నిర్వహించారు. ఉగ్రవాద (నిరోధక) చట్టం యుఎపిఎ కింద న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, పోర్టల్ హెచ్ ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. న్యూస్ క్లిక్ కార్యాలయాన్ని సీల్ చేశారు నిజాలను చెప్పే న్యూస్‌క్లిక్ పై కత్తిగట్టిన మోడీ సర్కార్ ఏమాత్రం పస లేని 'చైనా కుట్ర' థియరీని తెరపైకి తీసుకొచ్చింది. న్యూస్‌క్లిక్‌కు చైనా నుంచి డబ్బు వచ్చిందని, ఆ డబ్బుతో చైనా అనుకూల ప్రచారం చేస్తోందని కేంద్ర హోం శాఖ ఆరోపిస్తోంది. న్యూస్‌క్లిక్‌తో సంబంధం ఉన్న జర్నలిస్టులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారుల నివాసాలపైకి ఢిల్లీ స్పెషల్ సెల్‌కు చెందిన పోలీసులను పంపి సోదాలు నిర్వహించింది.. న్యూస్‌క్లిక్‌తో సంబంధమున్న జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లతో సహా ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హార్డ్ డిస్క్‌ల డేటా మిగతా 5లో

మీడియాపై దాడులను సహించబోం

- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

క్రూరమైన యుఎపిఎ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా పలువురు జర్నలిస్టులు, స్టాండ్-అప్ కమెడియన్లు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక చరిత్రకారులు, విమర్శకుల ఇళ్లపై ఢిల్లీ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేయడాన్ని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడిని మీడియాపైన, ప్రాథమిక హక్కు అయిన భావప్రకటనా స్వేచ్ఛపైన జరిగిన క్రూరమైన దాడిగా పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. మోడీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్, కశ్మీర్ వాలా, వైర్ వంటి వివిధ మీడియా సంస్థలను అణచివేయడానికి, వేధించడానికి, బెదిరించడానికి దర్యాప్తు సంస్థలను సాధనాలుగా చేసుకుంటున్నది. ఇప్పుడు న్యూస్ క్లిక్‌తో సంబంధమున్నవారిపై దాడులు చేయిస్తోంది. నిజాలు చెప్పే జర్నలిస్టులపై నిరంకుశంగా దాడులు చేయడం ఎంతమాత్రం సహించరానిదని పేర్కొంది. మీడియాను హింసించి, అణచివేసేందుకు వ్యవస్థీకృత కుట్ర జరుగుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యయుతంగా ఆలోచించే దేశభక్తులంతా ఏకతాటిపైకి రావాలని పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

గుంటూరు జిజిహెచ్‌లో శిశువు అపహరణ

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

తల్లి పొత్తిళ్ల నుంచి ఏడు రోజుల చిన్నారిని పట్టపగలే ఓ మహిళ ఎత్తుకెళ్లిన సంఘటన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. తల్లి నిద్రిస్తుండగా పసికందును తీసుకెళ్లినట్లు అధికారులు సిసి టివి ఫుటేజి ద్వారా గుర్తించారు. శిశువు మేనమామ సుభాని పటాన్ తెలిపిన వివరాల ప్రకారం..



గుంటూరు నగరం పొన్నూరు రోడ్డులోని సుబ్బయ్య కాలనీకి చెందిన తన సోదరి షేక్ రోషిని వారం రోజుల క్రితం ప్రసవం నిమిత్తం జిజిహెచ్‌కు వచ్చారు. గత నెల 31న ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చారు. మరుసటి రోజు 106వ వార్డుకు తరలించి మంచానికి ఇద్దరు చొప్పున బాలింతలను ఆస్పత్రి సిబ్బంది పడుకోబెట్టారు. రోషిని తన చిన్నారిని పక్కలో వేసుకుని నిద్రించారు. కొద్దిసేపటికి లేచి చూడగా శిశువు కనిపించకపోవడాన్ని గుర్తించి బిగ్గరగా కేకలు వేశారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సిసిటివిలను పరిశీలించగా గుర్తు తెలియని మహిళ ఆ బిడ్డను రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఆస్పత్రి ప్రధాన మార్గం నుంచి వెళ్లడాన్ని గుర్తించారు. మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ చేస్తే ఇంటికి వెళ్లిపోయేవారమని, ఇంతలోనే ఈ ఘటన జరిగిందని చిన్నారి తల్లిదండ్రులు బోరున విలపించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ ఆస్పత్రిలోకి రోగుల సహాయకులుగా కొంతమంది వచ్చి ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వివరించారు.

సిఎఫ్ఎంఎస్ గందరగోళం

- ట్రెజరీ, వర్క్స్ అక్కౌంట్స్ శాఖల పాత్ర పెంచండి
- ప్రత్యేక ఆడిట్ విభాగం లేదు
- అదనపు చెల్లింపులు జరుగుతున్నాయి
- ముసాయిదా నివేదికలో కాగ్
- పద్ధతి మార్చుకోవాలని సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బిల్లుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సిఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్), దానికి మూలమైన సిఎఫ్ఎస్ఎస్ (సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ సర్వీసెస్) గందరగోళంగా మారిందనికంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) సూచించింది. నిర్దుష్టమైన యంత్రాంగం లేకుండానే ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని దీని ప్రభావం ఖజానాపై తీవ్రంగా పడుతోందని పేర్కింది. ఈ మేరకు రూపొందించిన ప్రత్యేక ముసాయిదా నివేదిక ఆర్థికశాఖలో కలకలం రేపుతోంది. కొద్దిరోజుల క్రితమే ఉన్నతాధికారులకు చేరిన ఈ నివేదికపై ఆ శాఖలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సిఎఫ్ఎంఎస్‌ను అమలు చేయడానికి ప్రత్యేకమైన అంతర్గత వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. సాధారణ ఆడిట్ యంత్రాంగమే దీని బాధ్యతలు చూస్తోంది. సరైన నియంత్రణలు లేనందువల్లే ఈ ఏర్పాటు పాక్షికంగానే ప్రభావం చూపుతోంది. సిఎఫ్ఎంఎస్‌కు అనుగుణంగా కోడ్‌లను, నిబంధనలను సవరించలేదు. చివరకు వర్క్‌ఫ్లో విధానంలోనూ, సిస్టమ్స్‌లో కూడా అవసరమైన మార్పులు చేయలేదు.' అని ఈ నివేదికలో కాగ్ పేర్కొంది. తీవ్రమైన ఈ లోపాల కారణంగా చేసిన చెల్లింపులే మళ్ళీ,మళ్లీ చేయడం, ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో చెల్లింపులు చేయడం వంటి సంఘటనలు తరచు చోటు చేసుకుంటున్నాయని తెలిపింది. వీటిని దృష్టిలో ఉంచుకుని సిస్టమ్ అడ్మిన్‌స్ట్రేటర్‌గా సిఎఫ్ఎస్ఎస్ పాత్రను సాధ్యమైనంత మేర కుదించాలని సూచించింది. ఆ విభాగం పాత్రను పరిమితం చేసి ట్రెజరీ అకౌంట్స్ కార్యాలయం, వర్క్స్ అక్కౌంట్స్ శాఖల ప్రమేయాన్ని పెంపొందించాలని పేర్కొంది. వీటితో పాటు ఆర్థిక వ్యవహారాలతో సంబంధముండే ఇతర విభాగాల పాత్రను కూడా సాధ్యమైనంత మేర పెంపొందించాలని సూచించింది. పెద్ద సంఖ్యలో ఏర్పాటైన పిడి ఖాతాల నిర్వహణ కోసం ప్రత్యేక వర్క్‌ఫ్లోను రూపొందించి అమలు చేయాలని పేర్కొంది. దీనివల్ల విశ్వసనీయత పెరుగుతుందని తెలిపింది. గందరగోళంగా ఉన్న అక్కౌంటింగ్ విధానాన్ని పిఎజితో సంప్రదించి ఒక కొలిక్కి తీసుకురావాలని, దానికి అవసరమైన నిబంధనలను, కోడ్‌లను రూపొందించాలని సూచించింది. కంటింజెన్స్ ఫండ్ నిర్వహణకోసం పిఎజి అనుసరిస్తున్న అక్కౌంటింగ్ విధానాన్ని అమలుచేయాలని సూచించింది. ముసాయిదా నివేదికలో అనేక అంశాలపై విస్తృతంగా చర్చించినందున పూర్తిస్థాయిలో సమీక్ష చేసి, అవసరమైన నిర్ణయాలను తీసుకోవాలని ప్రభుత్వానికి కాగ్ సూచించింది. ఈ నివేదికలో 2018 నుంచి 2021 వరకు సాగిన లావాదేవీలను పిఎజి ప్రస్తావించింది.

బిల్లులపై నివేదికలో

ముసాయిదా నివేదికలో 2018 నుంచి 2021 వరకు పలు పద్దుల్లో జరిగిన వ్యయం, బిల్లుల అంశాలను ప్రస్తావించింది. ఈ మూడేళ్లలో 5,50,716 బిల్లులు ఒక సంవత్సరం నుంచి ఇంకో ఏడాది బదలాయింపు జరగ్గా, తాజా బిల్లులతో సహా 8,46,220 బిల్లులు ముగిసినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు కూడా ప్రస్తావిస్తూ వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించింది.


భారీగా బిల్లుల చెల్లింపులు

ఈ మూడేళ్ళ కాలంలో చెల్లింపులు జరిగిన బిల్లుల వివరాలు కూడా నివేదికలో పొందుపరిచారు. ఇందులో 2018-19లో ఏకంగా 25 లక్షలకు పైగా బిల్లులు ఉన్నాయని, వీటి విలువ 1.28 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నట్లు చూపించారు. ఇందులో వర్క్స్ బిల్లులే అధికంగా ఉన్నాయి. 2019-20 23.23 లక్షల బిల్లులు, 2020-21లో 25.05 లక్షల బిల్లులు, 2021-22లో సెప్టెంబర్ వరకు 9.42 లక్షల బిల్లులు చెల్లించినట్లు పేర్కొన్నారు.

చంద్రబాబుకు దక్కని ఊరట

- క్వాష్ పిటిషన్‌పై విచారణను 9కి వాయిదా వేసిన సుప్రీం

ప్రజాశక్తి- అమరావతి, న్యూఢిల్లీ



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంగళవారం సుప్రీం కోర్టులో ఎలాంటి ఉపశమనం లభించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన బెంచ్ ఈ కేసుపై తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టుకు అందజేసిన కేసు రికార్డులన్నింటినీ తమకు అందజేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాల అభివృద్ధి కుంభకోణం కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ చంద్రబాబు సుప్రీంను ఆశ్రయించారు. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, ఎ.ఎం.సింఘ్వి, సిద్ధార్థ్ లూథ్రా వాదిస్తున్నారు. ఒకే క్లయింట్ తరపున ఇంతమంది న్యాయవాదులు వాదించేందుకు సాధారణంగా అనుమతించబోమని కోర్టు వ్యాఖ్యానించింది.

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విధాన నిర్ణయాలకు సంబంధించిన కేసు ఇదని సాల్వే వాదించారు. అందువల్ల దీనిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టలేమని అన్నారు. 2015-16 బడ్జెట్‌లో నైపుణ్యాల అభివృద్ధి ప్రాజెక్టుకు కేటాయించిన రూ.360 కోట్ల కేటాయింపు కూడా వుంది. చంద్రబాబుపై క్రిమినల్ చర్యలు చేపట్టడానికి ముందుగా అవినీతి నిరోధక చట్టంలోని 17ఎ సెక్షన్ కింద తప్పనిసరిగా తీసుకోవాల్సిన ముందస్తు అనుమతిని ప్రాసిక్యూషన్ తీసుకోలేదని చంద్రబాబు తరపు న్యాయవాదులు వాదించారు. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు అధికార విధుల్లో భాగంగా ప్రాజెక్టు చేపట్టాలన్న నిర్ణయం తీసుకున్నందున గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం అవసరమని లూథ్రా వాదించారు. ఎఫ్ఐఆర్‌లన్నీ దురుద్దేశంగా నమోదు చేసినవేనని బాబు న్యాయవాదుల బృందం పేర్కొంది. "సరైన అథారిటీ ముందస్తు ఆమోద ముద్ర లేకుండా ఒక పబ్లిక్ సర్వెంట్ చేసిన విధి నిర్వహణపై ఏ పోలీసు అధికారి విచారణను లేదా దర్యాప్తును చేపట్టలేరు." అని సుప్రీంకోర్టులో బాబు దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది. నిందితుడిపై ఇండియన్ పీనల్ కోడ్ నిబంధనల కింద విడిగా కేసులు నమోదైనపుడు సెక్షన్ 17ఎ రక్షణ వాటికి వర్తిస్తుందా మిగతా 2లో

ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి పెట్టాలి

- వెనుకబడిన ప్రాంతాలను ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధి చేయాలి
- పాదయాత్రలో సిపిఎం నాయకులు వి శ్రీనివాసరావు, ఎంఎ గఫూర్ డిమాండ్

లోపలి పేజీలో..

భారత వృద్ధి 6.3 శాతమే..

- 2023-24లో ప్రపంచ బ్యాంక్ అంచనా
- గతేడాది 7.2 శాతం పెరుగుదల

విద్యుత్ భారాలపై 9 నుంచి 15 వరకు

విస్తృతంగా ప్రజల్లోకి..

- తక్షణం కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- ఎన్ఐఎ దాడులకు ఖండన
- వామపక్ష పార్టీల తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకూ విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల మూలంగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాయి. మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో సిపిఐ (ఎంఎల్) నాయకులు జె కిషోర్‌బాబు అధ్యక్షతన వామపక్ష పార్టీల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ గఫూర్, వి ఉమామహేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, అక్కినేని వనజ, నాయకులు డి హరినాథ్ (సిపిఐఎంఎల్ లిబరేషన్)), పి ప్రసాద్ (సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ), ఎస్‌కె ఖాదర్ బాషా (ఎంసిపిఐ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలు, కరువు, ఉద్యోగుల ఆందోళనలు తదితర అంశాలను వామపక్ష పార్టీలు చర్చించి పోరాటాలకు కార్యాచరణను రూపొందించాయి. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు కొనసాగింపుగా ఈ నెల 9 నుంచి 15 వరకు కరపత్రాలను పంపిణీ చేయాలని, పేటలు, వీధుల్లో సమావేశాలు, ప్రజా బ్యాలెట్‌లు నిర్వహించి ప్రజల వ్యతిరేకతను కూడగట్టాలని నిర్ణయించాయి. విద్యుత్ భారాలపై జిల్లాల్లోనూ వామపక్షాలు సమావేశమై పోరాటాలకు కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై, దేశవ్యాప్తంగా మీడియా సంస్థలపై సోదాల పేరుతో ఎన్ఐఎ జరిపిన దాడులను సమావేశం ఖండించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును క్రమబద్ధీకరించాలని సమావేశం డిమాండ్ చేసింది.

లోపలి పేజీలో..

ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచండి

- సిఇఒ మీనాకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వినతిపత్రం

విద్వేష ప్రసంగాల్లో బిజెపినే ముందు!

- ఎడిఆర్ నివేదిక విడుదల

లఖింపూర్ ఖేరి కేసులో

కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి

- నిరసన ప్రదర్శన, ధర్నా



విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లఖింపూర్ ఖేరీలో రైతుల మరణానికి కారణమైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌మిశ్రాను బర్తరఫ్ చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం బ్లాక్‌డేగా పాటించారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని ధర్నా చౌక్‌లో నల్లబ్యాడ్జీలు, నల్లజెండాలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతు ఉద్యమ విరమణ సందర్భంగా లఖింపూర్ ఖేరీ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపడతామని లిఖిత పూర్వక హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం దానిని తుంగలో తొక్కిందని విమర్శించారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని చేసిన రైతాంగ ఉద్యమంలో 75 వేల మందిపై కేసులు పెట్టారని, ఆ కేసులను ఎత్తివేస్తామని చెప్పి ఇంత వరకు ఏ చర్యలూ తీసుకోలేదని ఆయన విమర్శించారు. మరణించిన నలుగురు రైతుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

అఖిల భారత కిసాన్‌సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ.. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సూచించిన సిఫార్సుల ప్రకారం సి టు ప్లస్ 50 శాతం కలిపి మద్దతు ధరలను ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. కేరళ ప్రభుత్వం కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల కంటే ఒక క్వింటా ధాన్యానికి రూ.750 అదనంగా బోనస్ ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రైతాంగ ఆత్మహత్యల నివారణకు కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మతతత్వ విధానాలను అవలంభిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న కేంద్రంలో అధికారంలో మిగతా 2లో



నేపాల్‌లో వరుస భూకంపాలు..

- ఢిల్లీలోనూ ప్రకంపనలు

న్యూఢిల్లీ : నేపాల్‌లో వరుసగా రెండుసార్లు భూకంపాలు సంభవించాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. మంగళవారం మధ్యాహ్నం 2.25 గంటలకు, 2.51గంటల భూకంపాలు రాగా, రిక్టర్ స్కేలుపై భూప్రకంపనలు వరుసగా 4.6, 6.2గా నమోదయ్యాయి. భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, హాపూర్, అమ్రోహాలో కూడా ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం. ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు.


రామగుండం

'ఎన్‌టిపిసి' జాతికి అంకితం

- కెసిఆర్‌పై ప్రధాని మోడీ తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రామగుండం ఎన్‌టిపిసిలో భాగంగా రూ.6 వేల కోట్లతో చేపట్టిన సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఎన్‌టిపిసి)ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతికి అంకితం చేశారు. నిజామాబాద్ జిల్లాలో మంగళవారం పర్యటించిన ఆయన తెలంగాణలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి ఎన్‌టిపిసి ప్రాజెక్టుతోపాటు మనోహరాబాద్-సిద్దిపేట రైల్వే లైన్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ ఎన్‌టిపిసితో తెలంగాణకు నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. జిహెచ్ఎంసి ఎన్నికలకు ముందు మాతో సఖ్యతగా ఉన్న కెసిఆర్ వైఖరి ఆ తర్వాత మారిపోయిందన్నారు. బల్దియా ఎన్నికల తర్వాత కెసిఆర్ ఢిల్లీ వచ్చి నన్ను కలిశారని, మీ హయాంలో దేశం దూసుకుపోతోందని భజన చేశారని తెలిపారు. ఎన్‌డిఎలో చేరతామని, తెలంగాణలో పాలనాపగ్గాలు కెటిఆర్‌కు ఇస్తానని అన్నారని, కెటిఆర్‌ను ఆశీర్వదించండని కెసిఆర్ కోరారని వివరించారు.



అయితే, ఇది రాజరికం కాదని, బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కెసిఆర్‌కు తేల్చి చెప్పానని మోడీ తెలిపారు. తెలంగాణలో ఇంకా రాజరికం కావాలని కెసిఆర్ భావిస్తున్నారని, అందుకే తన తర్వాత తన కొడుకును సిఎం చేయాలని చూస్తున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని అన్నారు. వందల మంది యువకుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో రాష్ట్ర ఖజానా ఒకే కుటుంబం దోచుకుంటోందని ఆరోపించారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.



విశాఖలో డబ్ల్యుఎఫ్‌టియు ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న సిహెచ్.నర్సింగరావు తదితరులు



విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన మనవహారంలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ విశాఖ / అమరావతి బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాలు అవలంభిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన తిప్పికొడతామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. అక్టోబర్ 3 వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఆపాలని, కార్మికులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని నాయకులు నినదించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నాడు లెనిన్ ప్రపంచ కార్మికులారా ఏకంకండోయ్ అంటూ ఇచ్చిన నినాద స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడుతోందన్నారు. వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ (డబ్ల్యుఎఫ్‌టియు) ఏర్పడి 78 సంవత్సరాలైన సందర్భంగా ఆవిర్భావ సభలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా వంటి పెట్టుబడిదారీ దేశాలన్నీ కార్మిక చట్టాలను మార్చడం, కనీస వేతనాలను తగ్గించడం, కార్మికులను అక్రమంగా తొలగించడం, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడం, మూసివేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నాయన్నారు. మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ, అదానీ కార్పొరేట్ సంస్థల లాభాలే ధ్యేయంగా పాలన సాగిస్తున్నా యని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు

విజయవాడలో మానవహారం..

డబ్ల్యుఎఫ్‌టియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి, ఎఐఎఫ్‌టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘాల నాయకులు సంఘీభావంగా పాల్గొన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం పోరాటం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు జె కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, కె సుబ్బరావమ్మ, నాయకులు ఆర్‌వి నరసింహారావు, డి రమాదేవి, కెఆర్‌కె మూర్తి, రైల్వే నాయకులు నరసింహారావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేషు, ఎఐఎఫ్‌టియు నాయకులు లక్ష్మణ్, రైతు సంఘాల నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వై కేశవరావు, వి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఇళ్లపై దాడులకు ఐలు ఖండన

ప్రజాశక్తి - విజయవాడ

న్యాయవాదుల ఇళ్లు, కార్యాలయాలపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఎ) దాడులను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రాజేంద్రప్రసాద్, ఎన్.మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దాడులను వెంటనే ఆపివేయాలని, దాడులు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచండి

- సిఇఒ మీనాకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వినతిపత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ వినియోగించరాదని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జనరల్ సెక్రటరీ, రిటైర్డు ఐఎఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలోని చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ కోసం సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పూర్వ హైకోర్టు న్యాయమూర్తి భవాని ప్రసాద్ నేతృత్వంలో ఏర్పడి పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. ఓటర్ల జాబితాలో లక్షలాది ఓట్లు తారుమారు అవుతున్నాయని, భోగస్ ఓట్లు తొలగించి అర్హులైన వారిని ఓటర్లుగా చేర్చుకోవాడానికి ప్రత్యేక కృషి జరగాలని అన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వార్డు, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవడం, వారితో వలంటీర్లు కలిసి పనిచేయడం వల్ల స్వేచ్ఛాయుత ఎన్నికల అవరోధాలు కలుగుతాయని వారు సిఇఒకు వివరించారు. ఓటర్లు జాబితాలోని లోపాలను సరిచేసే ప్రక్రియలో ఎంతో అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులను వినియోగించుకోవాలని తెలిపారు. మీనా స్పందిస్తూ.. వలంటీర్లను ఎలాంటి పరిస్థితిలోనూ ఎన్నికల విధుల్లో వాడుకోబోమని, ఎవరైనా అధికారులు వినియోగించుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా అగిరిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా విధి నిర్వహణలో వుంటూ అమరుడైన అగిరిపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ గంధం నాగేంద్ర కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. గత నెల 30న వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపును త్వరగా ముగించాలని నిర్వాహకులను సూచిస్తుండగా.. ఓ యువకుడు వెనుక నుంచి కర్రతో తలపై కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం మొదట విజయవాడ, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలించినా ఫలితం దక్కలేదు. మృత్యువుతో పోరాడి అమరుడైన నాగేంద్ర గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్ రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం, పోలీస్‌శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

దారి మళ్లిన స్థానిక నిధులు : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గ్రామ పంచాయతీరాజ్‌శాఖ నుంచి స్థానిక సంస్థలకు కేటాయించాల్సిన నిధులు ఇతర అవసరాలకు మళ్లించారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం కూడా ఈ మేరకు నిర్ధారణకు వచ్చిందని ఆమె పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బిజెపి రాష్ట్ర కమిటీ సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పొత్తులకు సంబంధించి పార్టీ అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు కిరణ్‌కుమార్ రెడ్డి, సోము వీర్రాజు, సుజనాచౌదరి, సత్యకుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుజరాత్‌లో జరిగిన అఖిల భారత ప్రజా రవాణా సంస్థల క్రీడా పోటీల్లో ఎపిఎస్‌ఆర్‌టిసి క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో సత్తాచాటారు. గుజరాత్ ఆర్‌టిసి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో ఎపిఎస్‌ఆర్‌టిసి టైటిల్‌ను గెలుచుకుంది. ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలోని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సాయిచరణ్ తేజ్, నూజివీడు డిపో కండక్టర్ రమేష్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో టైటిల్ గెలిచారు. వాలీబాల్‌లో కూడా క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చారు. క్రీడాకారులను ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్‌లోనూ అన్ని క్రీడాంశాల్లో ఎపిఎస్‌ఆర్‌టిసి సత్తాను చాటాలని తిరుమలరావు ఆకాంక్షించారు.

లఖింపూర్ ఖేరి కేసులో కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న బిజెపిని ఓడించడమే కార్మిక, కర్షకుల కీలక కర్తవ్యమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కల్పించే విధానాలను వైసిపి ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు.

ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. రైతులకు నష్టం చేసే విద్యుత్తు బిల్లు 2020ను వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు మీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ రవీంద్రనాథ్, జి ఓబులేషు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు నష్టం చేసే విధానాలను తీసుకురావడంతోపాటు కార్మికుల సంక్షేమాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు డి హరినాథ్, కొల్లా రాజమోహన్, వి కృష్ణయ్య, పి జమలయ్య, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, ఎం ఉమామహేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు జాస్తి కిశోర్‌బాబు, కె బసవయ్య, శ్రీధర్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డిపై కేసు నమోదు దుర్మార్గం : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం గొట్టిపాళ్లలో సంఘటన జరిగిన సమయంలో తిరుపతిలో ఉన్న టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విధ్వంస అరాచక పాలనకు అక్రమ కేసు నమోదు చేయడమే నిదర్శనమన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతోనే పోలీసులు ఈ అక్రమ కేసు నమోదు చేశారని, 307 సెక్షన్ కింద నమోదు చేసిన కేసులో బ్రహ్మారెడ్డి పేరు చేర్చడం ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపులో భాగమేనని పేర్కొన్నారు. కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బొప్పరాజు, చేబ్రోలుకు సన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం ఎపి రెవెన్యూ ఇ-డివిజనల్ మేనేజర్స్ (కాంట్రాక్టు ఎంప్లాయీస్) అసోసియేషన్ సాంకేతిక నిపుణులు వారిని విజయవాడలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇ-డిఎమ్ఎస్ అసోసియేషన్ అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి శ్రీకాంత్, కార్యనిర్వాహక మెంబరు గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపార్టుమెంట్‌లో ఎదుర్కొంటున్న సాంకేతిక, మౌలిక సదుపాయాల కల్పన సమస్యలను పరిష్కరించేందుకు ఎపిఆర్‌ఎస్‌ఎ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓట్ల తొలగింపునకు విధానం ఉంది : ఇసి

ప్రజాశక్తి, అమరావతి

ఓటర్ల లిస్ట్‌లోని పేర్లపై ఫిర్యాదు అందగానే ఆ వ్యక్తుల ఓట్లను తొలగింపు సులభం ఏమీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు చెప్పింది. ఒక విధానం ఉంటుందని, లిస్ట్‌లోని వాళ్ల పేర్లు తీసేయాలంటూ దరఖాస్తులు రాగానే రొటీన్‌గా తీసేయడానికి వీలుండదని ఈసీ తరపు న్యాయవాది డిఎస్ శివదర్శన్ చెప్పారు. 5 అంతకంటే ఎక్కువ అప్లికేషన్లు వస్తే వాటిని ముగ్గురుతో కూడిన కమిటీ పరిశీలిస్తుందని వివరించారు. పేర్లను తొలగించాలని కోరుతున్నారో అలా తొలగించే వ్యక్తులకు నోటీసుల జారీ చేసి వివరణ కూడా పొందుతామన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో అఫిడవిట్ వేయాలని ఈసీకి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందర్‌రావుల డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. తన నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపు జరిగిందంటూ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను అక్టోబర్ 31కి వాయిదా పడింది.

శిక్షణ పథకాన్ని సద్వినియోగపర్చుకోవాలి

- ఉపాధి, శిక్షణ సంస్థ సంచాలకులు నవ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంకేతిక శిక్షణ సంస్థ ద్వారా అర్హులైన అభ్యర్థులకు డిసెంబరులో నిర్వహించే శిక్షణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి, శిక్షణ సంస్థ సంచాలకులు బండి నవ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణ అందించనున్న క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన ఫీజు నవంబరు తొమ్మిదిలోగా చెల్లించాలన్నారు. ఇతర వివరాల కోసం ఐటిఐ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

భారత వృద్ధి 6.3 శాతమే..

- 2023-24లో ప్రపంచ బ్యాంక్ అంచనా
- గతేడాది 7.2 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు పడిపోనుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని ప్రపంచ బ్యాంక్ తాజా రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ వైపు దూసుకుపోతోన్నామని ప్రధానీ మోడీ పదేపదే చెబుతున్న మాటలకు భిన్నంగా ఈ అంచనాలు వెలుపడటం గమనార్హం. ఇంతక్రితం 2022-23లో భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 7.2 శాతంగా నమోదయ్యిందని ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్ (ఐడియు) రిపోర్ట్‌లో గుర్తు చేసింది. 2021-22లో 9.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది. "ప్రపంచవ్యాప్త ప్రతికూల వాతావరణం స్వల్పకాలికంగా సవాళ్లను విసురుతూనే ఉంటుంది... ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం వల్ల ఎక్కువ మంది ప్రయివేటు పెట్టుబడులు పెట్టడం వల్ల భవిష్యత్తులో ప్రపంచ అవకాశాలను చేజిక్కించుకోవడానికి భారత్‌కు అవకాశాలున్నాయి." అని ప్రపంచ బ్యాంకు ఇండియా కంట్రీ డైరెక్టర్ అగస్టే టానో కౌమే పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన రిపోర్టులో కూడా భారత వృద్ధి రేటు 6.5 శాతానికి పరిమితం కావొచ్చని అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌కు అద్దం పట్టే తయారీ రంగం గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1.3 శాతం పెరుగుదలకు పరిమితమయ్యింది. ఇంతక్రితం ఏడాది ఈ రంగం ఏకంగా 11.1 శాతం వృద్ధిని కనబర్చింది. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రయివేటు రంగ పెట్టుబడుల్లో తగ్గుదల చోటు చేసుకోవచ్చు. బ్యాంక్‌ల రుణాల జారీ, నిర్మాణ రంగంలో పెద్ద పురోగతి ఉండకపోవచ్చు. వర్షాభావం వల్ల పలు ఉత్పత్తుల ధరలు పెరిగి.. ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. అంతర్జాతీయ ప్రతికూల అంశాలతో స్టాక్ మార్కెట్లు దిద్దుబాటుకు గురైయ్యే అవకాశాలున్నాయి. బ్యాంకింగ్ రంగంలో మాత్రం మొండి బాకీలు తగ్గి.. లాభాదాయకతలో మెరుగుదలను ప్రదర్శిస్తున్నాయి." అని ఆర్థిక శాఖ రిపోర్ట్‌లో పేర్కొంది.

రూ.650 తగ్గిన బంగారం

న్యూఢిల్లీ : బంగారం ధరల్లో వరుసగా తగ్గుదల చోటు చేసుకుంటుంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.650 తగ్గి రూ.57,550గా నమోదయ్యిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెల్లడించింది. ఇంతక్రితం సెషన్‌లో రూ.58,200 వద్ద ముగిసింది. కిలో వెండిపై రూ.1,800 పతనమై రూ.71,500 వద్ద ముగిసింది. విదేశీ మార్కెట్లలోనూ బంగారం, వెండి ధరల్లో తగ్గుదల చోటు చేసుకుంటుంది. ఒక్క ఔన్స్ పసిడి ధర 1.825 డాలర్లుగా, వెండి ధర 21.10 డాలర్లుగా నమోదయ్యింది. గత కొన్ని వారాలుగా అమెరికా బాండ్లలో పెట్టుబడులు పెరగడంతో బంగారంపై పెట్టుబడులు తగ్గుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో 10 గ్రాముల బంగారం ధర 57,426కు పడిపోయింది. వచ్చే కొద్ది రోజుల్లో పసిడి ధరల్లో 10 శాతం వరకు దిద్దుబాటుకు గురైయ్యే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారత్‌లో 5జిపై మోజు

- డిసెంబర్ కల్ల 3 కోట్ల యూజర్లు : ఎరిక్‌సన్ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి భారత్‌లో 5జి వినియోగదారులు 3.1 కోట్లకు చేరొచ్చని ఎరిక్‌సన్ సర్వేలో వెల్లడయ్యింది. 5జికి డిమాండ్ పెరుగుతోందని పేర్కొంది. ఇతర దేశాలతో పోలిస్తే భారతీయులు రెండు గంటలు ఎక్కువగా 5జి సర్వీస్‌లను ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. ఎరిక్‌సన్ సర్వే ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 80 లక్షల నుంచి కోటి మంది 5జి వినియోగదారులున్నారని అంచనా వేసింది. ఎక్కువ మంది 5జి డేటాను హై క్వాలిటీ వీడియో స్ట్రీమింగ్, వీడియో కాలింగ్, మొబైల్ గేమ్‌లు ఆడేందుకు ఉపయోగిస్తున్నారు. 15 శాతం మంది యాప్ వినియోగం, వీడియో స్ట్రీమింగ్, గేమింగ్, మ్యూజిక్ వంటి సర్వీస్‌లతో కూడిన 5జి డేటా ప్లాన్లకు ప్రస్తుత ధర కంటే 14 శాతం ఎక్కువ చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. భారత్‌లో గతేడాది అక్టోబర్‌లో పలు ప్రయివేటు టెల్కోలు 5జి సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

మాజీ మంత్రి బండారుకు బెయిలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్, మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత పూచికత్తుతో విడుదల చేసింది. సత్యనారాయణ మూర్తిని సోమవారం రాత్రి విశాఖపట్నం జిల్లాలో అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం తెల్లవారుజామున నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిఎం, మంత్రి రోజా ప్రతిష్టను దిగజార్చే విధంగా కుట్రచేశారన్న అభియోగంపై 153ఎ, 354ఎ, 504, 505, 506, 509, 499 120బి ఐపిసి, 67 ఐటి యాక్ట్ కింద బండారు సత్యనారాయణ మూర్తిపై కేసులు నమోదు చేశారు. వైద్యపరీక్షల నిమిత్తం ఆయనను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సాయంత్రం 5.40 గంటల ప్రాంతాల్లో స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. దాదాపు మూడు గంటల విచారణ అనంతరం న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. అంతకు ముందు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఉన్న బండారును కలిసేందుకు వచ్చిన టిడిపి నాయకులను పోలీసులు అనుమతించలేదు. పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబుతో పలువురిని గృహనిర్బంధంలో ఉంచారు.

హైకోర్టులో రేపు విచారణ

ముఖ్యమంత్రి జగన్, మంత్రి రోజాపై అనుచిత విమర్శలు చేశారనే కేసు విచారణను ఎదుర్కొంటున్న బండారు సత్యనారాయణమూర్తికి సీఆర్‌పీసీలోని 41ఎ నోటీసు ఇచ్చామని ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నోటీసు జారీ చేస్తే దానిని తీసుకోలేదని, మరో కేసులో నోటీసు ఇవ్వలేదని ప్రభుత్వం చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ టి. రాజశేఖర్‌రావుల డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. 41ఏ నోటీసు ఇచ్చి విచారణకు రావాలని చెప్పిన వెంటనే అరెస్టు చేశారని బండారు లాయర్ చెప్పారు. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

చంద్రబాబుకు దక్కని ఊరట

(మొదటి పేజీ తరువాయి)

లేదా అన్నది ఇక్కడ ప్రశ్నగా వుందని కోర్టు పేర్కొంది. 2018 నాటి సవరణలో అవినీతి నిరోధక చట్టంలో సెక్షన్ 17ఎను ప్రవేశపెట్టినప్పుడు ఆ రక్షణ అనేది అంతకుముందు నమోదైన కేసుల్లో అంటే ఇక్కడ 2015 నాటి ఈ కేసులో వర్తిస్తుందా లేదా అన్న అంశంపై కూడా న్యాయస్థానం చర్చించింది.

ఎప్పుడో 21 మాసాల క్రితం నమోదైన ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్ (నాయుడు)

పేరు అకస్మాత్తుగా వచ్చిందని, పైగా అక్రమంగా అరెస్ట్ చేశారని, ఆయన స్వేచ్చను హరించారని, ఇవన్నీ కూడా రాజకీయ కారణాలతోనే జరిగాయని స్పెషల్ లీవ్ పిటిషన్ పేర్కొంది. పిటిషనర్‌పై ఎలాంటి సాక్ష్యాధారాలు లేనప్పటికీ ఆయన్ని అక్రమంగా అరెస్టు చేసి, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి మరీ వేధిస్తున్నారని ఆ పిటిషన్ పేర్కొంది.

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తీర్పు రిజర్వు

ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు పేరుతో భూ దోపిడీకి పాల్పడ్డారనే అభియోగాల కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు వేసిన కేసులో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు మంగళవారం పూర్తవ్వడంతో జస్టిస్ కె సురేష్‌రెడ్డి తీర్పును వాయిదా వేశారు.

10న సిఐడి విచారణకు హాజరవ్వండి.. లోకేష్‌కు హైకోర్టు ఆదేశం

ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్పు చేశారనే అభియోగాలపై నమోదైన కేసులో ఈ నెల 10న సిఐడి నిర్వహించబోయే విచారణకు హాజరుకావాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు హైకోర్టు ఆదేశించింది. లోకేష్ విచారణకు హాజరయ్యేప్పుడు న్యాయవాదిని అనుమతించాలంటూ సిఐడికి పలు షరతులు విధించింది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విచారించాలని పేర్కొంది. మధ్యాహ్నం గంట సమయం భోజన విరామం ఇవ్వాలని చెప్పింది. ఫలానా డాక్యుమెంట్ తేవాలని కోరకూడదని న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంలో హెరిటేజ్ సంస్థకు చెందిన ఖాతా పుస్తకాలు, భూములు కొనుగోలు లావాదేవీల పత్రాలతో ఈ నెల 4న విచారణకు హాజరుకావాలంటూ లోకేష్‌కు సిఐడి సెక్షన్ 41(ఏ) కింద నోటీసు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులో ఆయన లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

నిందితుడే కాదు.. ముందస్తు బెయిలా? : సిఐడి

సిఐడి నమోదు చేసిన ఫైబర్ నెట్ కేసులో నారా లోకేష్ నిందితుడు కారని, ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన కోరడాన్ని సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఒకవేళ లోకేష్‌ను సిఐడి నిందితుడిగా చేర్చితే సిఆర్‌పిసిలోని 41ఎ నోటీసు ఇచ్చాకే విచారణ జరుగుతుందని హైకోర్టుకు హామీ ఇచ్చారు. ఈ వివరాలను జస్టిస్ కె సురేష్‌రెడ్డి రికార్డుల్లో నమోదు చేసుకుని లోకేష్ ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్లు ప్రకటించారు.

ఇంటి వద్దనే విచారణ చేసేలా ఉత్తర్వులివ్వండి : మాజీమంత్రి పి నారాయణ

ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో సిఐడి జారీ చేసిన 41ఎ నోటీసులను రద్దు చేయాలంటూ ఆ కేసులో నిందితుడైన మాజీ మంత్రి పొంగూరు నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. తను వృద్ధాప్యంతో ఉన్నానని, విచారణ చేయదలిస్తే ఇంటి వద్దనే చేసేలా సిఐడికి ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారించనుంది.

పెడనలో అల్లర్లకు పవన్ కుట్ర

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు మాస్టర్ స్కెచ్‌తో పెడనలో అల్లర్లు సృష్టించేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కుట్రలు చేస్తున్నారని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ వారాహి యాత్ర అవని గడ్డలో ఫ్లాప్ కావడంతో దిక్కుతోచక ప్రశాంతంగా వున్న ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడుతు న్నారని అన్నారు. ఆయనపై దాడికి వైసిపి కుట్ర చేస్తుందని పవన్‌కల్యాణ్ ప్రకటించడం తగదన్నారు. చిత్తశుద్ధి వుంటే ఆధారాలను ప్రభుత్వానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- మంత్రి కె సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజికవర్గం పెద్దన్నపాత్ర పోషించాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అవనిగడ్డ సభలో చెప్పడం హాస్యాస్పదంగా ఉందని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో 54 శాతం మంది కాపులు వైసిపికి ఓటు వేసి అప్పుడే పెద్దన్నపాత్ర పోషించారన్నారు. ఇప్పుడేమైనా కాపులను అడిగి చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ మద్దతిచ్చారా? అని ప్రశ్నించారు.

'వారాహి'లో అల్లర్లకు ప్రభుత్వం ప్రయత్నం

- జనసేన అధినేత పవన్ కల్యాణ్



మచిలీపట్నంలో జరిగిన 'జనవాణి-జనసేన భరోసా'లో వికలాంగులతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

'రాష్ట్ర సుస్థిరతకు జనసేన, టిడిపి కలిశాయి. దీన్ని చెడగొట్టేందుకు జగన్ ప్రభుత్వం పథక రచన చేస్తోంది. జనసేన చేపట్టిన వారాహి విజయయాత్రను అడ్డుకునేందుకు జగన్ ప్రభుత్వం కొన్ని నెలలుగా ప్రయత్నిస్తోంది.' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. నాలుగో విడత వారాహి విజయయాత్రలో భాగంగా మంగళవారం కృష్ణా జిల్లా మచిలీపట్నం సువర్ణ కల్యాణ మండపంలో "జనవాణి-జనసేన భరోసా" కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వివిధ తరగతులు, వర్గాల ప్రజల నుంచి 200లకుపైగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పెడనలో జరిగే బహిరంగ సభలోకి కొందరు గూండాలను, క్రిమినల్లను చొప్పించి రాళ్లదాడి చేయడానికి ప్రభు త్వం పకడ్బందీ వ్యూహం రచించినట్లు స్పష్టమైన సమాచారం ఉంద న్నారు. ఇటువంటి గొడవలను జనసేన సహించదని హెచ్చరిం చారు. రాళ్ల దాడికి పాల్పడిన వారిపై జనసైనికులు ఎదురుదాడి చేయవద్దని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దాడులు చేస్తే డిజిపికి, రాష్ట్ర హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

పవన్‌కు నడుం నొప్పి.. జనవాణి నుండి నిష్క్రమణ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రమైన నడుం నొప్పితో బాధపడుతున్నారు. గత మూడు రోజులుగా ఆయన కష్ణా జిల్లాలో వారాహి యాత్ర నిర్వహిస్తున్నారు. మంగళవారం మచిలీపట్నంలో జరిగిన జనవాణిలో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అయితే నడుం నొప్పి కారణంగా ఆయన కొన్ని అర్జీలను మాత్రమే తీసుకున్నారు. ఇదే విషయాన్ని ఆయన జనవాణిలో చెప్పి మధ్యలోనే నిష్క్రమించారు. దీంతో జనసేన నేతలు మిగిలిన అర్జీలను స్వీకరించారు.



పాదయాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



గుంటూరు జిల్లా ఉండవల్లిలో పాదయాత్రను ప్రారంభించిన ఎంఎ గఫూర్

ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి పెట్టాలి

- వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధి చేయాలి
- పాదయాత్రలో సిపిఎం నాయకులు వి శ్రీనివాసరావు, ఎంఎ గఫూర్ డిమాండ్

ప్రజాశక్తి- సీతారాపురం (నెల్లూరు), తాడేపల్లి (గుంటూరు)

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని, పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులిచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. గత ఎన్నికల ముందు మోడీ, జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలను, ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన జిల్లా సమగ్రాభివృద్ధి యాత్రలు జరుగుతున్నాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మూడు బృందాలు పాదయాత్రలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా రెండో బృందం పాదయాత్రను సీతారామపురం మండలం బసినేనిపల్లి వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం శిలావలకూలకే పరిమితమైందని, ఎంతో వెనుకబడి ఉందని, ఈ ప్రాంతం నుంచి వలసలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సీతారామసాగర్ ప్రాజెక్ట్ కోసం సిపిఎం పలు పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి ఒక కాలువ ద్వారా వెలుగొండ ప్రాజెక్టుకు, సీతారామ సాగరును నిర్మించి మరో కాలువ ద్వారా నీరు అందిస్తే ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలతోపాటు కడప, ప్రకాశం జిల్లాల్లోని మరికొన్ని ప్రాంతాలు కూడా సస్యశ్యామలం అవుతాయన్నారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ చేసిన ద్రోహం ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. అత్యధిక ఎంపి స్థానాల్లో వైసిపిని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి... అధికారంలోకి వచ్చాక మోడీకి భయపడి ప్రత్యేక హోదా పోరాటాన్ని పక్కనపెట్టారని, అదానీ, అంబానీ లాంటి కార్పొరేటర్లకు రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారమూ ఇప్పటికీ అందలేదని వెలువర్రు గ్రామస్తులు శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కటారి అజయ్‌కుమార్, మూళి వెంగయ్య పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గ ప్రజా చైతన్యయాత్రను ఉండవల్లి సెంటర్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని నిలువునా ముంచేసినా బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎందుకు సాగిలపడుతున్నాయని ప్రశ్నించారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని రెండు పార్టీల తగాదాల్లో ప్రజలు నలిగిపోతున్నారన్నారు. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని భ్రమరావతిగా మిగిల్చిందని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతి రాజధానికి అంగీకరించిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మూడు రాజధానులని అంటున్నారని విమర్శించారు. దీనిపై ప్రధాని మోడీ నోరు ఎందుకు మెదపడంలేదని ప్రశ్నించారు. మూడు రాజధానులను కాదు... 30 రాజధానులను పెట్టుకోమని బిజెపి నాయకులు జివిఎల్ నరసింహారావు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అమరావతి రాజధానిగా ఉండాలనేది సిపిఎం విధానమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని సిపిఎం కోరుకుంటోందని తెలిపారు. సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతి రైతులతో మాట్లాడుతున్న భువనేశ్వరి

అమరావతి నిర్మాణం జరిగి తీరుతుంది

- సంఘీభావంగా వచ్చిన రాజధాని రైతులతో భువనేశ్వరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

అమరావతి నిర్మాణం జరిగి తీరుతుందని, రాజధాని కోసం రైతులు చేసిన త్యాగాలు వృథా కావని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రాజధాని ప్రాంత మహిళలు, రైతులు పెద్దఎత్తున రాజమహేంద్రవరం తరలివచ్చి భువనేశ్వరికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. రాజధాని విధ్వంసం కంటే చంద్రబాబును జైల్లో పెట్టిన ఘటనే తమకు ఎక్కువ బాధ కలిగించిందని వాపోయారు. అమరావతి నుంచి రాజమహేంద్రవరం వస్తున్న తమను వీరవల్లి టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకుని ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించి ఆందోళనా చేసినా కనికరించలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నవరం సత్యనారాయణస్వామి దేవాలయానికి వెళ్తున్నామని చెప్పిన తర్వాతే తమను అనుమతించారని పేర్కొన్నారు. అమరావతి ఉద్యమం నాటి నుంచి తమను ప్రభుత్వం వేధిస్తూనే ఉందన్నారు. చంద్రబాబుపై నమ్మకంతోనే తమ భూములు రాజధానికి ఇచ్చామని రైతులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు. రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన త్యాగాల గురించి చంద్రబాబు ఎప్పుడూ తనతో చెబుతుండేవారన్నారు. మూడు రాజధానులు అంటూ వైసిపి ప్రభుత్వం రాజధానే లేకుండా చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని అన్నారు.

ఎన్ఐఎ దాడులపై న్యాయవాదుల నిరశన

- నేడు విధుల బహిష్కరణకు బిబిఎ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ

న్యాయవాదుల ఇళ్లు, కార్యాలయాలపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) దాడులను ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ (బిబిఎ) ఆధ్వర్యంలో విజయవాడలో న్యాయవాదులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. బుధవారం విధులు బహిష్కరించి నిరసన తెలపనున్నట్లు ప్రకటించారు. విజయవాడ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయులు ఇళ్లలో సోదాలు చేయడాన్ని నిరసిస్తూ సివిల్ కోర్టుల ఆవరణలోని బిబిఎ హాలు వద్ద దీక్ష చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హక్కులు, న్యాయం కోసం నిలబడే మేథావులు, న్యాయవాదుల ఇళ్లపై దాడులు, సోదాలు చేపట్టడం సరికాదన్నారు.

మరో సీనియర్ న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ సెక్షన్ 100, 160, 165, 41డి వంటి వాటిని ఉల్లంఘించి ఎన్ఐఎ పోలీసులు దాడులు, సోదాలు చేయడం హేయమైన చర్యన్నారు. ఈ దీక్షలకు టిడిపి ఎమ్మెల్సీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి సంఘీభావం తెలిపారు. దీక్షల్లో న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయులు, ఎఎస్ఎస్.రామ్ ప్రసాద్, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు చేకూరి శ్రీపతి, పిళ్లా రవి, సంపర శ్రీనివాస్, మన్మధరావు పాల్గొన్నారు.



న్యాయవాదుల దీక్షలో మాట్లాడుతున్న బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్

న్యూస్ క్లిక్ పాత్రికేయుల ఇళ్లపై దాడులకు ఒపిడిఆర్ ఖండన

హక్కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులపై ఎన్ఐఎ దాడులను, ఢిల్లీలో న్యూస్ క్లిక్‌కు చెందిన పాత్రికేయుల ఇళ్లపై, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ ఇంటిపై ఢిల్లీ పోలీసుల దాడులను ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపిడిఆర్) ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. అప్రజాస్వామికమైన, అక్రమమైన ఈ దాడులను, అరెస్టులను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

17,005 జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు : జోగి రమేష్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్




రాష్ట్ర వ్యాప్తంగా 17,005 జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో మంగళవారం ఆయన పర్యటించారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎండి డాక్టర్ జి లక్ష్మీశ, కాకినాడ ఎంపి వంగా గీత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లాతో కలిసి సిఎం జగన్మోహన్ రెడ్డి పర్యటనా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి రమేష్ మాట్లాడుతూ సామర్లకోట ఇటిసి లే-అవుట్‌లో 2,400 ఇళ్లకు వెయ్యి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఈ నెల ఐదున పూర్తయిన ఇళ్లల్లో గృహ ప్రవేశాలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21.75 లక్షల ఇళ్లకు, 6.82 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు నేడు జరుగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు దవులూరి దొరబాబు చేస్తున్న కృషిని అభినందించారు. ఆయన వెంట ఎస్‌పి సతీష్‌కుమార్, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

రైస్ మిల్లర్ల పరేషాన్!

- ప్రభుత్వం నుండి రెండేళ్లుగా వర్కింగ్ ఛార్జీలు పెండింగ్
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 173 మిల్లులకు రూ.166.50 కోట్లు బకాయి

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి



ధాన్యం వర్కింగ్ అనుమతులకు అవసరమైన బ్యాంక్ గ్యారెంటీలు చూపడం రైస్ మిల్లర్లకు కష్టంగా మారింది. రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వర్కింగ్ ఛార్జీలు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడమే ఇందుకు కారణం. దీంతో, 2023-24 వ్యవసాయ సీజన్లో పండిన ధాన్యం సేకరణ ప్రణాళిక అమలు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా సేకరించిన ధాన్యాన్ని సమీపంలోని రైస్ మిల్లుల్లో మరపట్టి గోదాములకు తరలిస్తోంది. ఒక ఎసికె (29 వేల కిలోలు) ధాన్యం మరపట్టినందుకు రూ.4 వేలు, సార్టెక్స్ (మట్టి, నూకలు) తొలగించినందుకు రూ.25 వేలు, ఈ మొత్తం బియ్యం ఒక కిలోమీటరు ట్రాన్స్‌పోర్టేషన్‌కు రూ.250 చొప్పున ఛార్జీలను ప్రభుత్వం రైస్ మిల్లర్లకు చెల్లించాల్సి ఉంది. 2022-23 సీజన్‌కు సంబంధించి కృష్ణా జిల్లాలో 6.50 లక్షల టన్నులు, ఎన్‌టిఆర్ జిల్లాలో 1.60 లక్షల టన్నుల చొప్పున మొత్తం 8.10 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. కృష్ణా జిల్లాలో 151 రైస్ మిల్లులు, ఎన్‌టిఆర్ జిల్లాలో 22 మొత్తం మిల్లుల్లో ఈ మొత్తాన్ని ప్రాసెస్ చేసి వచ్చిన బియ్యాన్ని ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా సమీపంలోని ఎఫ్‌సిఐ, పౌరసరఫరాల శాఖ గోదాములకు తరలించారు. రైస్ మిల్లర్లకు 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు వర్కింగ్ ఛార్జీలను ప్రభుత్వం విడుదల చేయలేదు. రెండు ఆర్థిక సంవత్సరాలకు కలిపి జిల్లాలోని రైస్ మిల్లులకు రూ.166.50 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

బ్యాంక్ గ్యారెంటీలు చూపేదెలా?

మరో 45 రోజుల్లో 2023-24 ఆర్థిక సంవత్సరం ధాన్యం సేకరణ మొదలుకానుంది. ఆర్‌బికెల ద్వారా సేకరించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బ్యాంక్ గ్యారెంటీ చూపిన రైస్ మిల్లర్లకు మాత్రమే ధాన్యం తోలడానికి పర్మిట్ ఇస్తారు. గంటకు ఒకటి నుంచి రెండు టన్నులు వర్కింగ్ సామర్థ్యం ఉన్న రైస్ మిల్లు రూ.50 లక్షలు, 6 నుంచి 10 టన్నుల సామర్థ్యం ఉన్న మిల్లు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు బ్యాంక్ గ్యారెంటీలు చూపాలి. గత రెండు సీజన్ల వర్కింగ్ ఛార్జీలు ఒక్కో రైస్ మిల్లుకు సగటున రూ.40 లక్షల నుంచి రూ.కోటికిపైగా రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నగదు డిపాజిట్ చేసి బ్యాంక్ గ్యారెంటీలు చూపడం సమస్యగా మారుతోందని రైస్ మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కరెంటు ఛార్జీలు

గంటకు మూడు టన్నులు పూర్తి సామర్థ్యంతో మర ఆడిన రైస్‌మిల్లుకు గత సీజన్‌లో నెలకు సగటున లక్ష రూపాయల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఈ ఏడాది 30 శాతం వరకు పెరిగి రూ.1.30 లక్షలు చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు ఇంధన సర్దుబాటు ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ధాన్యం వర్కింగ్ ఛార్జీలు పెంచాలని రైస్ మిల్లర్లు కోరుతున్నారు.

బెయిల్ రాకుండా జగన్ కుయుక్తులు

- చంద్రబాబుతో భువనేశ్వరి, బ్రాహ్మణి, చినరాజప్ప ములాఖత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



టిడిపి అధినేత చంద్రబాబుకు బెయిల్ రాకుండా సిఎం జగన్మోహన్‌రెడ్డి కుయుక్తులు పన్నుతున్నారని మాజీ హోం మంత్రి నిమ్మకాయల చిన్నరాజప్ప ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రరంలోని కేంద్ర కారాగారంలో ఉన్న చంద్రబాబును మంగళవారం ఉదయం 11 గంటలకు నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, చిన రాజప్ప ములాఖత్ అయ్యారు. సుమారు 40 నిమిషాలపాటు ఈ ములాఖత్ జరిగింది. అనంతరం సెంట్రల్ జైలు ఎదుట మీడియాతో ఆయన మాట్లాడారు. జైల్లో ఉన్నా రాష్ట్రం నాశనమవుతోందనే బాధలోనే చంద్రబాబు ఉన్నారని తెలిపారు. 'న్యాయ పోరాటం చేద్దాం.. న్యాయంగానే గెలుద్దాం' అని చెప్పారని, అరాచక పాలనపై మరింతగా పోరాడాలని సూచించారని చెప్పారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణను అన్యాయంగా అరెస్టు చేసి గుంటూరుకు తరలించారని, కనీసం మందులు కూడా ఇవ్వనీయకుండా పోలీసులు పాశవికంగా వ్యవహరించారని విమర్శించారు. అందరితో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని చంద్రబాబు ఆదేశించారని, దీని ప్రకారమే నడుచుకుంటామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణే ఏకైక లక్ష్యం

- సిపిఎం ఆధ్వర్యాన రేపు విశాఖలో భారీ బహిరంగ సభ
- హాజరు కానున్న సీతారాం ఏచూరి, వి శ్రీనివాసరావు ప్రభృతులు
- అరుణారుణమయంగా ఉక్కు నగరం పరిసర ప్రాంతాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 5వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు విశాఖలోని కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద భారీ బహిరంగ సభ జరగనుంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.ప్రభావతి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు, పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు ఉక్కునగరం సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నేతలు కెఎం.శ్రీనివాస్, రామస్వామి, శ్రీనివాసరాజు మంగళవారం పర్యవేక్షించారు. బహిరంగ సభ ప్రధాన వేదిక, సీటింగ్, జనం హాజరు వంటి విషయాలపై చర్చించారు. బ్యానర్లు, స్వాగత ద్వారాలు జెండాలతో ఇప్పటికే ఈ ప్రాంతం అరుణారుణమయంగా మారింది. సిపిఎం ఆధ్వర్యాన గత నెల 20 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకూ ఉత్తరాంధ్ర అంతటా సాగిన ఉక్కు రక్షణ బైకు యాత్ర జనాన్ని ఇప్పటికే కదిలించింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజెప్పింది. ఈ క్రమంలో ఈ బహిరంగ సభకు వేలాది మంది తరలి రానున్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటం... స్ఫూర్తిదాయకం

సుమారు మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలను మోడీ సర్కారు తీవ్రతరం చేసింది. వాటిని తిప్పికొడుతూ అకుంఠిత దీక్షతో 964 రోజులుగా ఉక్కు కార్మికులు పోరాడుతున్నారు. మరోవైపు స్టీల్ ఉత్పత్తికి తమ పోరాటం వల్ల ఏ సమస్యా రాకుండా ముందుకు సాగుతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. దేశంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వ వాటాలను విక్రయించడం ద్వారా రూ.లక్షల కోట్లను రాబట్టుకుని పబ్బం గడుపుకోవాలని చూసిన మోడీ సర్కారుకు విశాఖ కార్మికవర్గం గట్టిగా ఎదురుతిరుగుతూ పోరాడుతూ వస్తోంది. సొంత గనులు కేటాయించకుండా, ప్లాంట్‌కు వచ్చే రా మెటీరియల్ ఐరన్ ఓర్, కోకింగ్ కోల్‌ను అడ్డుకునే కేంద్ర కుట్రలను నిర్విరామంగా తిప్పికొడుతోంది.

తిరుపతిలో బాలుడి కిడ్నాప్

గంటల్లోనే కథ సుఖాంతం : ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి ఆర్‌టిసి బస్టాండ్‌లో అపహరణకు గురైన బాలుడిని ఎట్టకేలకు పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి మీడియాకు వెల్లడించారు. ఆయన వివరాల మేరకు... తిరుపతి ఆర్‌టిసి బస్టాండులో చెన్నై ప్లాట్ ఫామ్ రిజర్వేషన్ టికెట్ కౌంటర్ దగ్గర చెన్నైకి చెందిన అరుల్‌మురుగన్ అనే బాలునితో తల్లిదండ్రులు మీనా, చంద్రశేఖర్, అన్న మోఘున వసంత్‌తో పాటు నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి మురగన్ కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడిని అవిలాల సుధాకర్ అనే వ్యక్తి అపహరించినట్లు సిసిటివి ఫుటేజీలో పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియాలో ఈ విషయం ప్రచారం కావడంతో ఏర్పేడు మండలం మాధవమాల గ్రామంలోని తన అక్క నెల్లూరి ధనమ్మ ఇంటి వద్ద బాలుడిని వదిలిపెట్టి నిందితుడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలుడిని రక్షించి, తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని, ఆయన అక్కను, కొంతమంది అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంటల్లోనే బాలుడిని రక్షించిన పోలీసులను ఎస్‌పి అభినందించారు.

హైసెన్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా రవీంద్ర జడేజా



న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల తయారీదారు హైసెన్స్ తమ టెలివిజన్, ఎసి, రిఫ్రిజిరేటర్ విభాగాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ రవీంద్ర జడేజాను నియమించుకున్నట్లు ప్రకటించింది. ఇది యువ, ఔత్సాహిక వినియోగదారులలో ప్రజాదరణను ప్రతిబింబిస్తుందని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. భారత మార్కెట్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి జడేజాతో క్యాంపెయిన్ దోహదం చేయనుందని హైసెన్స్ ఇండియా సిఇఒ ప్రణబ్ మొహంతి పేర్కొన్నారు.

బీచ్ శాండ్ కుంభకోణంపై సిఎం సమాధానం చెప్పాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బీచ్ శాండ్ మినరల్ ప్రాజెక్టు పేరుతో తీర ప్రాంతాన్ని అదానీకి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది వేల కోట్ల కుంభకోణమనే విమర్శలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీర ప్రాంతాన్ని అప్పనంగా అదానీకి కట్టబెట్టేందుకు బీచ్‌శాండ్ మైనింగ్‌పై వున్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసేందుకు తెరలేపిందన్నారు. ఈ మేరకు మైన్స్ అండ్ మినరల్స్ యాక్ట్ 1975 చట్టసవరణకు కేంద్రం పూనుకుందని తెలిపారు.

సంపాదకీయం


కులగణన...

ప్రజలందరికి సంక్షేమం, సామాజిక న్యాయం అందించడం, అభివృద్ధి సాధించడం ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే వాస్తవ పరిస్థితులపై సంపూర్ణమైన అధీకృత సమాచారం కావాలి. కొన్ని వేల సంవత్సరాలుగా మన దేశంలో నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో దిగువ కులాలకూ, ఎగువ కులాలకూ మధ్య తీవ్ర అంతరాలున్నాయి. అవి సమసిపోతే తప్ప అభివృద్ధి అసాధ్యం. కనుక కులగణన ఒక తప్పనిసరి అవసరం. 1931లో బ్రిటీష్ పాలనలో చివరిసారి కులగణన నిర్వహించారు. 2011లో అప్పటి యుపిఎ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కులగణన పేరిట సమాచారం సేకరించింది. దాని నిర్దిష్టతలపై సందేహాలున్నాయంటూ ఆ వివరాలను అటకెక్కించింది. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కోరుతూ బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిలపక్షం ప్రధాని మోడీని 2021లో కోరింది. ఆ రాష్ట్ర బిజెపి ప్రతినిధి కూడా ఆ బృందంలో ఉన్నా, కేంద్ర సర్కారు మౌనముద్రలోనే ఉండిపోయింది. అనేక సార్లు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలు కావడంతో తామే చొరవ చూపాలని బీహార్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. గత జనవరి, ఏప్రిల్‌లో కులగణనతోపాటు ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహించింది. బీహార్‌లో కుల గణనను రద్దు చేయాలని కేంద్రంలోని పెద్దల అండదండలతో పాట్నా హైకోర్టు, సుప్రీంకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలను పాట్నా హైకోర్టు కొట్టివేయగా, సుప్రీంకోర్టు వాటిని ప్రచురించవచ్చని పేర్కొనడంతో వివరాల వెల్లడికి మార్గం సుగమమైంది.

గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేసిన కుల గణన వివరాలు అనేక వాస్తవాలను సాక్షాత్కరింపజేశాయి. 13.07 కోట్ల బీహార్ జనాభాలో 63 శాతానికి పైగా ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి), అత్యంత వెనుకబడిన తరగతులు (ఇబిసి) ఉన్నారు. ఒబిసిలు మూడున్నర కోట్లు (27.13 శాతం), ఇబిసిలు 4.70 కోట్లు (36.01 శాతం), 2.6 కోట్ల మంది ఎస్‌సిలు (19.65 శాతం), 22 లక్షల మంది ఎస్‌టిలు (1.68 శాతం) ఉన్నారని గణాంకాలు ధ్రువీకరించాయి. జనరల్ కేటగిరీలో ఉన్న ఇతర కులాలు 15.5 శాతం అని, హిందువులు 81.99 శాతం, ముస్లిములు 17.7 శాతం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, ఇతర మతాల వారు ఒక శాతం లోపేనని నివేదిక తెలిపింది. జనాభాకు సంబంధించిన పూరిస్థాయి గణాంకాలు అందుబాట్లో లేకపోవడంతో 1979లో అప్పటి జనతా పార్టీ ప్రభుత్వం నియమించిన మండల్ కమిషన్ నివేదికే ప్రభుత్వాలకు ఆధారంగా ఉంది. ఆ నివేదిక ఒబిసిలు 52 శాతం ఉంటారని అంచనా వేసింది. ఆ శాతం మరింత ఎక్కువగా ఉంటుందన్న పలువురు సామాజిక అధ్యయనవేత్తల అంచనాలు నిజమని తాజా గణాంకాలు నిర్ధారించాయి.

సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఎన్నో వ్యత్యాసాలున్నాయని తాజా నివేదికలో తేటతెల్లమైంది. ఇప్పుడు అమలు చేస్తున్న విధానాలను మెరుగుపరిచి, పథకాలలో లోపాలను సరిదిద్ది...సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలది. గణాంకాల ఆధారంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని అక్కడి మహా కూటమి ప్రభుత్వం నడుం బిగిస్తే... వివరాలు సేకరించొద్దని, వెల్లడించొద్దని, కేంద్రం సేకరించాల్సిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వం ఎలా సేకరిస్తుందని, వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పిటిషనర్లు, కేంద్రం వాదనలు వినిపించడం విడ్డూరం. తమ వద్ద వివరాలు లేవని, సేకరించడం తమ బాధ్యతని బీహార్ ప్రభుత్వం చేసిన వాదనలను కోర్టులు సమర్థించడం ముదావహం. కులాల వారీగా జనాభా లెక్కలుంటేనే చిక్కులు, అపోహలు తొలగుతాయి. తాజా గణాంకాలు రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధనలను అత్యున్నత న్యాయస్థానం పున:సమీక్షించేందుకు దారితీయవచ్చు. వామపక్షాలు, పలు లౌకిక పార్టీలు కుల గణనను స్వాగతిస్తుండగా, బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జనాభా ఆధారంగా అణగారిన వర్గాలకు సంక్షేమంలో, అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తే... రాజకీయ సమీకరణాలు మారిపోతాయని, కుల, మత వైషమ్యాలను తిప్పికొడతారని అభివృద్ధి నిరోధకుల భయం. ఇప్పటికైనా జనహితం దృష్ట్యా జనగణనతోపాటు కులగణనను కేంద్రమే చేపట్టాలి. గతంలో కులాల వారీగా జనగణనకు ప్రయత్నించిన తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ప్రభుత్వాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ కులగణనకు బీహార్ చూపిన మార్గం స్ఫూర్తి కావాలి.

మంచి మాట



ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో,
ఎక్కడ మనిషి సగర్వంగా తలెత్తుకు
తిరగగలడో, ఎక్కడ మన చదువూ,
విజ్ఞానం మూఢ నమ్మకాల్లో ఇంకిపోదో,
ఎక్కడ ఒక మనిషి తోటి మనిషిని దోచుకోడో,
అక్కడ, ఆ స్వేచ్ఛా స్వర్గంలోకి
నా ఈ దేశాన్ని మేలుకొలుపు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

హరిత విప్లవ పితామహుడు, స్వయం సమృద్ధ యోధుడు

సందర్భం

విజూ కృష్ణన్

భారతదేశ హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ ఆరు దశాబ్దాలకు పైగా భారతదేశ వ్యవసాయ రంగంలో అద్భుతమైన, స్పష్టమైన అస్తిత్వాన్ని కలిగి వున్నారు. ఇదే కాలంలో ఆహార సంక్షోభం కలిగిన దేశంగా, దిగుమతులపై ఆధారపడే స్థాయి నుండి తగిన ఆహార నిల్వలతో స్వాలంబనను సాధించిన దేశంగా భారత్ ఎదిగింది. అనేక కారణాలు, లక్షలాది మంది సమిష్టి కృషి ఇటువంటి పరివర్తనకు దారి తీసినప్పటికీ, హరిత విప్లవానికి, దాని నిర్మాత, రూపశిల్పి డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు ప్రధానంగా ఈ ఘనత, ఖ్యాతి దక్కుతుందని చెప్పవచ్చు. అధిక దిగుబడులను ఇచ్చే రకాలు, ఇరిగేషన్, రసాయన ఎరువులు ఉపయోగించి ముమ్మరంగా వ్యవసాయం సాగించడం ద్వారా హరిత విప్లవ సాంకేతికతను ప్రవేశపెట్టడం వెనుక ప్రధాన చోదక శక్తి డాక్టర్ స్వామినాథన్. అయితే, రైతాంగం, వ్యవసాయ కూలీలు, శాస్త్రవేత్తల కృషి, వ్యవసాయ అనుబంధ సేవలు అలాగే సబ్సిడీల ద్వారా వ్యవసాయ రంగంలో పెట్టుబడుల ద్వారా ప్రభుత్వ తోడ్పాటు, గ్రామీణాభివృద్ధి లేకపోతే ఇదేమీ సాధ్యం కాదని, ఫలించదని ఆయన విశ్వసించారు. 1943లో బెంగాల్‌లో కరువు కాటకాలు సంభవించి, 30 లక్షల మందికి పైగా ప్రజలు ఆకలి దప్పులతో మరణించడం, తీవ్రమైన బియ్యం కొరతను దేశం ఎదుర్కొన్న పరిస్థితుల్లో ఆయన వ్యక్తిగత ప్రేరణతో వ్యవసాయ రంగంలో పరిశోధనను ప్రారంభించారు. ఆకలి, ఆహార కొరతలకు సంబంధించిన చెరిగిపోని ఈ ముద్రను, ఇటువంటి పరిస్థితులను అధిగమించాలనే తపన ఆయన జీవితాంతం కొనసాగింది. దానికోసం ఆయన తన ప్రయత్నాలను చివరి వరకూ కొనసాగిస్తూనే వచ్చారు. ఆయన పద్ధతులతో ఏకీభవించని వారు సైతం ఈ వాస్తవాన్ని మాత్రం కాదనలేరు.

బయో టెక్నాలజీ అనేది అత్యంత శక్తివంతమైన సాధనమని, దాన్ని ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించాలని స్వామినాథన్ విశ్వసించారు. అయితే అంతిమంగా ఉత్పత్తులనేవి ప్రమాదరహితాలని ప్రజలకు నమ్మకం కలిగించేలా ముప్పులను, ప్రయోజనాలను అంచనా వేయాల్సి వుందని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. జీవ భద్రతకు సంబంధించిన ఆందోళనలన్నీ పక్కా పద్ధతిలో పరిష్కరించబడ్డాయని హామీ కల్పించేందుకు సరైన సమర్ధవంతమైన స్వతంత్ర సంస్థలతో కఠిన పరీక్షలు నిర్వహించాల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పారు. దీన్ని కేవలం వ్యవసాయ రంగ వాణిజ్యానికి మాత్రమే వదిలివేయలేమని ఆయన స్పష్టం చేశారు. పైగా స్వీయ ధృవీకరణను ఆయన వ్యతిరేకించారు. తప్పు చేసిన కంపెనీలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, బాధితులకు పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించేలా, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ (అణు విపత్తులు సంభవించినపుడు పౌర బాధ్యత) తరహాలోనే ఒక వ్యవస్థను నెలకొల్పాల్సిన ఆవశ్యకత కూడా వుందని ఆయన పేర్కొన్నారు. రసాయన ఎరువులను అధికంగా ఉపయోగించడం, మోనో కల్చర్స్ (ఏక సంస్కృతులను-ఒకే పంట పద్ధతులను) పాటించడం, ఇతర వ్యవసాయ రంగ సాంకేతికాల కారణంగా జరుగుతున్న నష్టాన్ని తనకు తానే అంచనా వేసుకుని, సమీక్షించడం వల్లనే ఆయన ఈ నిర్ధారణకు వచ్చారని ఆయనతో మాట్లాడినపుడే నాకు తెలిసింది.


భారతదేశ ఆహార సంక్షోభాన్ని అధిగమించడానికి, అలాగే ఆహార ధాన్యాల దిగుమతుల ద్వారా కొరతను నివారించడమనే పద్ధతిని అధిగమించడానికి హరిత విప్లవం సాయపడిందని ఆయన చాలా ధృఢంగా విశ్వసించారు. మనలాంటి దేశాల్లో వ్యవసాయ ఉత్పత్తిని తీవ్రంగా ప్రభావితం చేసే కారణాలు (వరదలు, వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు, నీటిలో లవణ సాంద్రత)ను పరిష్కరించడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని ఆయన నొక్కి చెప్పారు.

బయో టెక్నాలజీ, మాన్‌శాంటో వంటి అగ్రి బిజినెస్‌ల పట్ల ఆయన దృక్పథంలోని కీలకమైన వ్యత్యాసం ఇదే. అందువల్లే, నీటిలో లవణ సాంద్రత, కరువు, వరదలు, వాతావరణ పరిస్థితులను దీటుగా తట్టుకునేలా వివిధ రకాల వంగడాలను అభి వృద్ధిపరచడం వంటి సమస్యలను పరిష్కరించ డంపైనే ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మాన్‌శాంటో వంటి అగ్రి బిజినెస్‌లు తెగుళ్ల సమస్యలను, ఫంగల్ దాడులు వంటి బయోటిక్ (జీవ సంబంధ మైన) కారణాలను ఎదుర్కొనడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. నీటిలో లవణ సాంద్రత, కరువు కాటకాలు లేదా వరదలు వంటి జీవ సంబంధం కాని కారణాలు మొక్కల్లో మార్పులకు అనుగుణంగా వుండవు. మరోపక్క ఉత్పాదకతను తగ్గించే చీడపీడలు, తెగుళ్ళు పట్టడం వంటి జీవ సంబంధిత కారణాలు నిరోధకంగా మారవచ్చు, సూపర్ పెస్ట్‌లుగా ఆవిర్భవించవచ్చు, దానితో వాటిని ఎదుర్కొనడానికి మరింత కొత్తవైన, ఖరీదైన రెండో తరం వెరైటీలు అవసరమవుతాయి. భారత్ వంటి దేశాల్లో, పేద, సన్నకారు రైతాంగం ప్రధానంగా వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడిన పరిస్థితుల్లో అత్యంత కీలకమైన సమస్యలను పరిష్కరించగల సాంకేతికతలను, వ్యవసాయ పద్ధతులను వ్యాప్తి చేయడం చాలా ముఖ్యమని డాక్టర్ స్వామినాథన్ బాగా గ్రహించారు. బి.టి వంకాయ వివాదంలో కూడా పక్కా పరీక్షలు జరగకుండా పంటలు వేయాల్సిన ఆవశ్యకత లేదని ఆయన స్పష్టం చేశారు. పైగా దేశం మొత్తం ఆహార భద్రత కోసం వంకాయ వంటి పంటలు పెద్దగా ప్రభావం చూపవని అన్నారు.

విత్తన బిల్లుపై చర్చ సందర్భంగా ఆయనతో మాట్లాడే మొదటి అవకాశం నాకు లభించింది. వ్యవసాయ రంగంపై విస్తృత పరిజ్ఞానం ఆయనకు వుంది. పైగా నాలాంటి అనుభవం లేని వ్యక్తి చెప్పేది వినే, అంగీకరించే మంచి స్నేహ స్వభావం ఆయనది. తన వైఖరికి భిన్నంగా వున్నప్పటికీ, కిసాన్ సభ తరపున రూపొందించిన విత్తన బిల్లు సవరణలు కొన్నింటిలోని తార్కికతను ఆమోదించగలిగే ఉదాత్తత ఆయన స్వంతం. పార్లమెంట్‌లో వాటికి మద్దతిస్తానని చెప్పిన హామీకి ఆయన కట్టుబడి వున్నారు.

ఈ అంశంపై విస్తృత ఏకాభిప్రాయానికి జరిగిన కృషికి కూడా ఆయన మద్దతిచ్చారు. ఈ బిల్లుపై వివిధ రాజకీయ పార్టీలు ఒకే రకమైన వైఖరులు తీసుకోవడంలో ఈ విస్తృత ఏకాభిప్రాయం ప్రతిబింబించింది. అయితే, ఒక శతాబ్ద కాలం విస్తరించిన ఒక వ్యక్తి జీవిత కాలంలో చేసిన సేవలను అంచనా వేసేటపుడు, ఆ వ్యక్తి ప్రజల పక్షాన, దోపిడీకి గురయ్యే పేదల పక్షాల నిలబడ్డారా లేక వారికి వ్యతిరేకంగా నిలబడ్డారా అనేది అంచనా వేయాల్సి వుంటుంది. విమర్శలను అంగీకరించే వినయం, అలాగే తప్పులు జరిగాయని తెలుసుకున్నపుడు వాటిని సరిదిద్దుకునే చర్యలు తీసుకోవడమనేది కూడా ఒక ముఖ్యమైన ప్రామాణికంగా చెప్పవచ్చు.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల విషయంలో ఆయన



జాతీయ రైతాంగ కమిషన్ ఛైర్‌పర్సన్ హోదాలో ఆయన చేసిన ప్రాథమిక సిఫార్సులు చాలా గణనీయమైనవి, గుర్తుంచుకోదగ్గవి. వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహక ధరలు కల్పించాలి. ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలపడం ద్వారా కనీస మద్దతు ధరను (ఎంఎస్‌పి) లెక్కించాలి. నాలుగు శాతం వడ్డీ రేటు దాటకుండా అందుబాటు ధరల్లో అందరికీ వ్యవసాయ రుణాలు లభించాలి, ఒడిదుడుకులతో కూడిన మార్కెట్ నుండి రైతులకు రక్షణ కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి...అనేవి ఇందులో ముఖ్యమైన సిఫార్సులు. వ్యవసాయ రంగంలో లాభదాయకత క్షీణించడం, రైతుల దుస్థితి పెరగడం, వారి రుణ భారాలు పెరగడాన్ని దృష్టిలో వుంచుకుని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు, తోడ్పాటు మరింతగా అందించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు ఉద్యమ డిమాండ్లలో స్వామినాథన్ ఎంఎస్‌పి ఫార్ములా ప్రధానమైనది. మోడీ ప్రభుత్వం దీనిని అమలు చేయకుండా రైతులను దగా చేసింది.

తీసుకున్న వైఖరులు ఆయనను లక్షలాదిమంది అన్నార్తుల వైపు, లక్షలాదిమంది నిరుపేదలు, సన్న చిన్నకారు రైతాంగం వైపు నిలబెడతాయి. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి నుండి వైదొలగడమనే ప్రభుత్వ నయా ఉదారవాద వైఖరికి వ్యతిరేకంగా కృతనిశ్చయంతో నిలబెడతాయి. ఆహార భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే దిశగా ఆయనకు నిరంతర తపన వుంది. ఆ లక్ష్య సాధన దిశగానే ఆయన పరిశోధన నిర్దేశించబడింది. శాస్త్రీయ సాంకేతికతను వ్యాప్తి చేసేందుకు, రైతాంగానికి సాంకేతికతను బదిలీ చేయడానికి ప్రభుత్వ విస్తరణ వ్యవస్థ (పబ్లిక్ ఎక్స్‌టెన్షన్ సిస్టమ్)కు ఆయన గట్టి మద్దతుదారుగా వున్నారు. లక్ష్యిత ప్రజా పంపిణీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ, సార్వజనీన ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను ఆయన అర్థం చేసుకున్నారు, ప్రోత్సహించారు. తగిన రక్షణలతో ప్రైవేటు రంగాన్ని అనుమతిస్తూ, ధరలపై నియంత్రణ వుంటూ విత్తనాల ఉత్పత్తి, పరిశోధనలో ప్రభుత్వ రంగ పాత్ర చురుకుగా వుండాలని ఆయన పేర్కొనేవారు.

జాతీయ రైతాంగ కమిషన్ ఛైర్‌పర్సన్ హోదాలో ఆయన చేసిన ప్రాథమిక సిఫార్సులు చాలా గణనీయమైనవి, గుర్తుంచుకోదగ్గవి. వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహక ధరలు కల్పించాలి. ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలపడం ద్వారా కనీస మద్దతు ధరను (ఎంఎస్‌పి) లెక్కించాలి. నాలుగు శాతం వడ్డీ రేటు దాటకుండా అందుబాటు ధరల్లో అందరికీ వ్యవసాయ రుణాలు లభించాలి, ఒడిదుడుకులతో కూడిన మార్కెట్ నుండి రైతులకు రక్షణ కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి...అనేవి ఇందులో ముఖ్యమైన సిఫార్సులు. వ్యవసాయ రంగంలో లాభదాయకత క్షీణించడం, రైతుల దుస్థితి పెరగడం, వారి రుణ భారాలు పెరగడాన్ని దృష్టిలో వుంచుకుని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు, తోడ్పాటు మరింతగా అందించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు ఉద్యమ డిమాండ్లలో స్వామినాథన్ ఎంఎస్‌పి ఫార్ములా ప్రధానమైనది. మోడీ ప్రభుత్వం దీనిని అమలు చేయకుండా రైతులను దగా చేసింది.

చిన్న కమతాల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి ఆయన బాసటగా నిలబడ్డారు. పంట-పశువుల సమగ్ర ఉత్పత్తి వ్యవస్థల ద్వారా, ఆగ్రో ప్రాసెసింగ్, బయోమాస్ వినియోగం వంటి వాటి ద్వారా బహుళ జీవనోపాధి అవకాశాలతో చిన్న కమతాల ఆదాయాన్ని పెంచాలని భావించారు. ఆహార ఉత్పత్తి లక్ష్యాలను ఎదుర్కొనడానికి, ఆకలి, దారిద్ర్యం, గ్రామీణ నిరుద్యోగం వంటి సమస్యలను తగ్గించడానికి ఈ రెండూ కీలకమని ఆయన భావించారు. అందరికీ ఆహారమన్న లక్ష్యాన్ని సాకారం చేసుకునే మన సామర్థ్యం కన్నా చాలా వేగంగా జనాభా పెరుగుతుండడం ఆయన గమనించారు. అదే సమయంలో, కుటుంబాల స్థాయిలో తగిన కొనుగోలు శక్తి లేకపోవడం కారణంగా వినిమయం కూడా పెరగదు. ఆయన మాటల్లో చెప్పాలంటే, "గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి అవకాశాలు పేలవంగా పెరుగుతున్న కారణంగా సంభవిస్తున్న జీవనోపాధులు, ఉపాధి సంక్షోభం కుటుంబాల స్థాయిలో ఆహార సంక్షోభానికి దారి తీస్తోంది." నయా ఉదారవాద ఆర్థిక విధానాలను చాలా తీవ్రంగా విమర్శించడమే ఇది.

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వృద్ధి రేటు క్షీణించడంతో హరిత విప్లవ రంగంలో ఒక రకమైన నిస్సత్తువ నెలకొందని స్వామినాథన్ గ్రహించారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగించడం, ఒకే పంటను పలుసార్లు వేయడమనే సంస్కృతి పెరగడం అనేక సమస్యలకు దారి తీస్తోందని అంగీకరించారు. ఇప్పటికే ఆలస్యమైందనే విమర్శ సమర్థనీయమైనప్పటికీ ఆయనలో ఎక్స్‌టర్నల్ ఇన్‌పుట్ సస్టెయిన్‌బుల్ అగ్రికల్చర్ (ఎల్ఇఐఎస్ఎ)-(వెలుపల నుండి తక్కువ పెట్టుబడులతో సుస్థిర వ్యవసాయం), సమగ్ర జాతీయ వనరుల నిర్వహణ, సమగ్ర చీడపీడల నిర్వహణ అలాగే వ్యవసాయ పర్యావరణ వైఖరుల గురించి కూడా గట్టిగా వాదించేవారు.

పంటల మార్పిడిని కూడా ఆయన సమర్థించేవారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఏక పంటల పద్ధతి నుండి బయటకు రావాలని కోరేవారు. హరిత విప్లవంతో అవిభాజ్యంగా పెనవేసుకు పోయిన స్వామినాథన్ లాంటి వ్యక్తి ఇటువంటి నిర్ధారణలకు వచ్చారంటే వాస్తవాన్ని అంగీకరించడం, కొత్తదనాన్ని గ్రహించడం వల్లనేనని అర్థమవుతోంది.

విభేదాలను పక్కనబెడితే, రైతాంగ ఉద్యమం తన డిమాండ్లను రూపొందించుకోవడంలో, పాలక వర్గ విధానాలకు వ్యతిరేకంగా పోరును మరింత ఉధృతం చేయడంలో ఆయన వైఖరులు ఇటీవలి కాలంలో రైతాంగ ఉద్యమానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

(వ్యాసకర్త ఎఐకెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి)

అభిప్రాయం

ఎట్టకేలకు న్యాయం

మద్రాస్ హై కోర్టు ఒక మంచి తీర్పు వెలువరించింది. మూడు దశాబ్దాల క్రితం జరిగిన హీన నేరంపై సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పుని సమర్థిస్తూ తీర్పునిచ్చింది. తమిళనాడులో వాచాతి గిరిజన గ్రామంపై 269 మంది రెవెన్యూ, అటవీ, పోలీసు ప్రభుత్వ అధికారులు దాడి చేసి వీరప్పన్‌కి సహకరిస్తున్నారన్న మిషతో ఊరు తగలబెట్టారు. 18 మందిపై అత్యాచారం చేశారు. బాధిత గ్రామస్తులు రిపోర్ట్ చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. తిరిగి వారిపైనే కేసులు పెట్టారు. ప్రారంతా ప్రజా సంఘాల మద్దతుతో మద్రాస్ హైకోర్టుని ఆశ్రయించగా, స్పందించి సీబీఐ కి కేసు అప్పగించింది. తరువాత నేరం నిరూపణ జరిగి అప్పటికి బతికి ఉన్న నిందితులందరినీ ముద్దాయిలుగా గుర్తించింది సెషన్స్ కోర్టు. శిక్ష పడ్డ 215 మంది ముద్దాయిలు హై కోర్టుని ఆశ్రయించగా వారి నేరాన్ని ధృవీకరిస్తూ మొన్న తీర్పు వెలువడింది. అందరికీ వారివారి నేరాల బట్టీ శిక్షలు ఖరారు అవ్వడమే కాకుండా బాధితులకు పరిహారం చెల్లించాలని కోర్టు చెప్పింది. ప్రభుత్వ అధికారులు నిందితులుగా ఉన్న ఈ కేసులో అధికార కేంద్రం నుండి ఎన్ని అడ్డంకులు ఎదురైనా చివరకు న్యాయం బలహీను లకు చేరడం ఊరట. ఆలస్యమైనా న్యాయం దక్కడం వ్యవస్థపై నమ్మకం పెంచుతుంది. బలహీనులకు భరోసా ఇస్తుంది. మూడు దశాబ్దాలుగా పోరాట పటిమ చూపిన బాధితులు, వారికి అండగా నిల్చిన పౌర సమాజం, దర్యాప్తు సంస్థ, న్యాయపాలిక ప్రశంసా పాత్రులు.

- డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ, సెల్ : 94408 36931.

తప్పిపోతున్న చిన్నారులు...

భారత దేశ వ్యాప్తంగా తప్పిపోయిన లేదా కిడ్నాప్ అయిన పిల్లల సంఖ్య దినదినం క్రమంగా పెరుగుతోంది. ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లలు, పక్క దుకాణంలో చాకొలేట్ కొనుక్కోవడానికి వెళ్లిన పిల్లలు తిరిగి మళ్లీ ఇంటికి రావడం లేదు. బాలల అక్రమ రవాణా (చిల్డ్రన్ ట్రాఫికింగ్) వ్యవస్థ వేళ్లూనుకొని బలపడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం 2018 నుంచి జూన్ 2023 వరకు దేశవ్యాప్తంగా 2,75,125 మంది బాలలు తప్పిపోయారని పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. నేడు భారతంలో గంటకు ఎనిమిది మంది పిల్లలు తప్పిపోతున్నారు. వీరిలో 62,237 మంది బాలురు. 2,12,825 మంది బాలికలు. పోలీసు యంత్రాంగం, పౌర సమాజం చొరవతో తప్పిపోయిన పిల్లల్లో 2,40,502 మంది బాలలు దొరికినప్పటికీ 34,623 మంది ఇప్పటికీ దొరకలేదు. వాడల్లో ఆడుకుంటున్న పిల్లల్ని చాకచక్యంగా దొంగిలించే ముఠాలు వారిని అక్రమ రవాణా చేసి సుదూర ప్రాంత పట్టణాల్లో వెట్టిచాకిరి లేదా వ్యభిచార వృత్తిలోకి బలవంతంగా దించడం నమ్మలేని నిజం అని తెలుస్తున్నది. సాధారణంగా రోడ్ల వెంట నిద్రించే కూలీలు, మురికివాడలు, పేదల నివాస స్థలాల నుంచి పిల్లల్ని దొంగిలించడం అధికంగా జరుగుతున్నది. సంతానం లేని తల్లితండ్రులకు అమ్మడం కూడా ఒక మంచి ఆదాయంగా అక్రమార్కులు ఎంచుకోవడం విచారకరం. దేశంలో దొంగిలించిన పిల్లల్ని చీకటి వ్యాపార సంస్థలకు గరిష్టంగా రూ.2-5 లక్షల ధర వరకు కూడా అమ్మడం జరుగుతున్నది. 2022లో 11,717 మంది బాలలు తప్పిపోయారని, అందులో 34 శాతం అనగా 3,974 మంది మాత్రమే దొరికారని, ఇప్పటికీ 7,698 మంది ఆచూకీ దొరకలేదని తేలింది. ఒకప్పుడు పట్టణ పిల్లల్ని మాత్రమే దొంగిలించే దుర్మార్గులు నేడు గ్రామీణ పిల్లల్ని కూడా దొంగిలించే స్థాయికి దిగజారడం ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నది. దొంగిలించిన లేదా కిడ్నాప్ చేసిన పిల్లల్ని దేవాలయాలు/బస్ కూడళ్లు/రైల్వే స్టేషన్లు/ ప్రధాన మార్కెట్ ఏరియాల్లో భిక్షాటనకు వినియోగించడం కూడా లాభసాటి వ్యాపారం అవుతున్నది. భారతదేశంలో దాదాపు 15 లక్షల మంది భిక్షగాళు ఉన్నట్లు అంచనా. భిక్షాటన చేసే వారి సంఖ్య పశ్చిమ బెంగాల్, యూపీల్లో అధికంగా ఉన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు. బాలల భద్రత, సంక్షేమం ప్రభుత్వాల ప్రాధాన్యం కావాలి. బాలలు తప్పిపోవడం లేదా కిడ్నాపింగ్‌కు గురికావడం ప్రభుత్వాల, పౌర సమాజ నిర్లక్ష్యమే. బాలల పరిరక్షణకు పటిష్ట చట్టాలు, అక్రమ రవాణా చేసిన వారికి కఠిన శిక్షలు అమలు పరచాలి. నేటి భారత పిల్లల భద్రతకు గొడుగు పట్టాలి.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ : 9949700037

లేఖ

సుబ్రమణ్యం

'నిలిపివేత' అంటే..!

అయ్యా ! జీవీయెల్ గారూ !

గత వారంలో ఎప్పుడో తమరు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రస్తుతానికి నిలిచి పోయింది అంటూ ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. మళ్ళీ నిన్న ప్రెస్‌మీట్ పెట్టి మరీ కేంద్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను ప్రస్తుతానికి నిలిపి వేసింది అని మరోసారి ఉద్ఘాటించారు (?)

మీరేం చెప్తున్నారో మాకైతే అర్థం కావడం లేదు. మీకైనా అర్థం అవుతోందా అని మాకు సందేహం కలుగుతోంది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగి తీరుతుంది అంటూ పార్లమెంట్ లోనే కేంద్ర మంత్రివర్యులు స్పష్టంగా ప్రకటించారు. దానిపై పునరాలోచన కేంద్రానికి లేనే లేదని కూడా మరోసారి స్పష్టం చేశారు. అంటే కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయంలో క్లారిటీ ఉందన్నమాటేగా? ఆ సందర్భంలో తమరు కూడా ప్రైవేటీకరణ జరిగినా, కార్మికులకేమీ ఢోకా ఉండదు అంటూ సన్నాయి నొక్కులు నొక్కినట్టు మాకు గుర్తుంది సుమండీ !

దాదాపు గత 900 రోజులుగా స్టీల్ కార్మికులు విశాఖ ఉక్కు ప్రజల సొత్తు అని, తెలుగు ప్రజలు పోరాడి, కేంద్రం మెడలు వంచి సాధించుకున్న పరిశ్రమ అని, దాని జోలికొస్తే సహించేది లేదని పోరాడుతున్నారు. ఆ పోరాటానికి తెలుగు ప్రజలందరి మద్దతూ ఉంది. ఈ పరిస్థితి చూసిన తర్వాత ఇతరత్రా ప్లాంట్ మనుగడను దెబ్బ తీసే కుట్రలను కొనసాగిస్తున్నా, ప్రైవేటీకరణ విషయంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసే సాహసం చేయలేక పోతోంది. ఆ విధంగా ఉక్కు కార్మికుల ఐక్య పోరాటం, దానికి పెరుగుతున్న సంఘీభావం ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా ఆపుచేయ గలుగుతున్నాయి.

మడమ తిప్పకుండా పోరాడుతూ కార్మికులు ప్రైవేటీకరణను ఆపు చేస్తే మధ్యలో మీరొచ్చి "కేంద్ర ప్రభుత్వం నిలుపు చేసింది" అని ప్రకటించడం విడ్డూరంగా ఉంది. పోనీ, మీరు చెప్పిందే కరెక్టు అనుకుంటే ప్రైవేటీకరణను నిలుపు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏ తేదీన, ఏ స్థాయిలో నిర్ణయం తీసుకుందో సదరు నిర్ణయానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వుల కాపీని విడుదల చేయగలరా? ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వుంటే ఆ విషయాన్ని ఉక్కు మంత్రి గారు కాని సంబంధిత శాఖ కార్యదర్శి గాని ఎందుకు ప్రకటించలేదు?

ఇంతకూ నిలుపు చేయడం అంటే అర్థం ఏమిటి? "ప్రస్తుతానికి ఆపాము, పరిస్థితి అనుకూలిస్తే వెంటనే అమ్మేస్తాం" అనా? అడవుల్ని, గనుల్ని, భూముల్ని, దేన్నీ మిగల్చకుండా అన్నింటినీ అదానీలకో, మరో కార్పొరేట్లకో కట్టబెడుతూన్న కేంద్ర ప్రభుత్వం ఒక్క విశాఖ ఉక్కు విషయంలో మాత్రం ఇంకో విధంగా ఆలోచిస్తోంది అనుకోవాలా? ఎన్నికలొస్తున్నాయి గనుక ఇప్పటికి ఆపుచేసి ఎన్నికలైపోగానే అమ్మకం (అర్పించడం) పని మళ్ళీ మొదలెట్టవచ్చు అని అనుకుంటోందా కేంద్రం?

ఉత్తరప్రదేశ్ నుండి రాజ్యసభకు ఎన్నికైనప్పటికీ తమరు ఎందుకోగాని తరచూ మా విశాఖపట్నం దయచేస్తూనే వున్నారు. వచ్చినప్పుడల్లా ఏవో కబుర్లు చెప్తూనే వున్నారు. కాని ఆ కబుర్ల తీపి నాలుక చివర్న తగుల్తోందే కాని కనీసం ఆ నాలుక చివరిదాకా కూడా నిలవకుండానే కరిగిపోతోందెందుకో!

తమరు విశాఖ రైల్వేజోన్ గురించి కూడా చాలా గొప్పగా చాలాసార్లు ప్రకటించారు. కాని విశాఖ రైల్వేజోన్ లో విశాఖ డివిజన్ ఉంటుందో, ఊడుతుందో ఆ సంగతి మాత్రం ఇంతవరకూ తేలలేదే! విశాఖ జోన్‌ను అట్టహాసంగా 2019 ఎన్నికల సందర్భంగా ప్రకటించేశారు కాని మళ్ళీ ఎన్నికలొస్తున్నా దానికి కనీసం ఒక జోనల్ మేనేజర్ కూడా లేరెందుకని?

వారం, పది రోజులకోసారి తమరు ఏదో ప్రకటించడం, తమరి వందిమాగధులు వెంటనే కల్పించుకుని తమరి ద్వారా మరికొన్ని మంచి పనులు (అనగా ఉత్తుత్తి ప్రకటనలు అని మాకు తెలుసు లెండి) జరగాలని అభ్యర్థించడం-ఈ డ్రామా చూసి చూసి బోరు కొడుతోంది మాకు.

తమరికి విశాఖ ఉక్కు విషయంలో ఏమాత్రమైనా నిజాయితీ ఉంటే, అది ప్రజల పోరాటం ద్వారా, 32 మంది ప్రాణాల త్యాగం నుంచి పుట్టుకొచ్చినదన్న స్పృహ ఉంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కనీసం ఒక్క రోజు దేశ రాజధానిలో నిరశన దీక్ష చేయగలరా?

అటువంటిదేదీ చేయడం చేతకాకపోతే కనీసం ఈ బూటకపు ప్రకటనలనైనా చేయడం మానుకోండి. మీతో పువ్వులు పెట్టించుకోడానికి మా చెవులేమీ తేరగా లేవు సుమా!

ఇట్లు,
విశాఖ ఉక్కు కార్మికులు.



తమరికి విశాఖ ఉక్కు విషయంలో ఏమాత్ర మైనా నిజాయితీ ఉంటే, అది ప్రజల పోరాటం ద్వారా, 32 మంది ప్రాణాల త్యాగం నుంచి పుట్టుకొచ్చినదన్న స్పృహ ఉంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రతిపాదనను పూర్తిగా విరమించు కోవాలని డిమాండ్ చేస్తూ కనీసం ఒక్క రోజు దేశ రాజధానిలో నిరశన దీక్ష చేయగలరా?
అటువంటిదేదీ చేయడం చేతకాకపోతే కనీసం ఈ బూటకపు ప్రకటనలనైనా చేయడం మానుకోండి.



పియర్రె అగోస్టిని, ఫెరెన్క్ క్రౌజ్, అన్నె హుయిలర్

భౌతిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోమ్ : అణువులు, పరమాణువుల్లోని ఎలక్ట్రాన్ల ప్రపంచాన్ని అన్వేషించేందుకు మానవాళికి కొత్త సాధనాలను అందజేసిన ప్రయోగాలను గుర్తిస్తూ భౌతిక శాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ పురస్కారం లభించింది. భౌతిక శాస్త్రవేత్తలైన పియర్రె అగోస్టిని, ఫెరెన్క్ క్రౌజ్, అన్నె హుయిలర్‌లకు నోబెల్ బహుమతిని ప్రకటిస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. కాంతి తరంగాలతో ఆటో సెకండ్ పల్స్‌లను ఉత్పత్తి చేసే పరిశోధనలకు వీరికి ఈ పురస్కారం దక్కింది. ఆటో సెకండ్ అనేది చాలా స్వల్పమైన, ఒక సెకనులో ఈ ఆటో సెకండ్లు చాలా వుంటాయి, విశ్వం ఆవిర్భవించినప్పటి నుండి ఇప్పటివరకు సెకండ్లు చాలా వుంటాయి. అణువుల్లో, పరమాణువుల్లో ఏం జరుగుతుందో దృశ్యాలను చిత్రీకరించేందుకు కాంతి తరంగాలకు సంబంధించిన ఈ స్వల్ప పల్స్‌లను ఉపయోగిస్తారు. అనేక దశాబ్దాల పాటు వీరి పరిశోధన సాగింది. ఒక పదార్థంలో ఎలక్ట్రాన్లు ఎలా వ్యవహరిస్తాయో అర్థం చేసుకోవడానికి ఈ కొత్త సాంకేతికత చాలా కీలకమైనది.

గాంగ్టే కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసిన సెమిన్‌లున్ గాంగ్టే కస్టడీని పాటియాలా హౌస్ కోర్టు మంగళవారం మరో ఎనిమిది రోజులు పొడిగించింది. ప్రస్తుతం మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండను ఉపయోగించుకుంటూ మయన్మార్, బంగ్లాదేశ్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలతో కలిసి భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంగ్టే కుట్రలకు పాల్పడుతున్నాడని ఎన్ఐఎ ఆరోపిస్తోంది. జూన్ 21న మణిపూర్‌లో బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తా ప్రాంతంలో జరిగిన బాంబు పేలుళ్ల కేసులో గాంగ్టే నిందితుడని ఎన్ఐఎ తెలిపింది. జులై 19న చురచంద్‌పూర్‌లోని అతని నివాసం వద్ద గాంగ్టేను అరెస్టు చేశారు. ఎన్ఐఎ వాదనలు విన్న కోర్టు గాంగ్టే కస్టడీ పొడిగింపునకు అంగీకరించింది. ఎఫ్ఐఆర్ కాపీని గాంగ్టే, ఆయన న్యాయ వాదులకు కూడా అందించాలని ఆదేశించింది.

మీడియా వేటలో భాగంగానే దాడి

- మీడియా మొత్తాన్ని బిజెపి కబళించింది
- థామస్ ఐజాక్

ప్రజాశక్తి-తిరువనంతపురం

భారత దేశంలో ప్రశంసలు తప్ప విమర్శనాత్మక జర్నలిజం అవసరం లేదని న్యూస్‌క్లిక్‌పై దాడుల ద్వారా మోడీ ప్రభుత్వం తేల్చి చెప్పిందని కేరళ మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ వ్యాఖ్యానించారు. కేరళలో, బెదిరింపులు, ఒత్తిడి వ్యూహాలను ఉపయోగించి దాదాపు అన్ని మీడియా సంస్థలను బిజెపి తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. భారత దేశంలో నేటికీ వెన్నెముక ఉన్న మీడియా సంస్థలు ఉన్నాయి. బెదిరింపుల ద్వారా వాటిని లొంగదీసుకోవాలన్నది బిజెపి ఎత్తుగడ. బిబిసి, న్యూస్ లాండ్రీ, దైనిక్ భాస్కర్, భారత్ సమాచార్, ద కశ్మీర్ వాలా , ద వైర్ వంటి మీడియా సంస్థలపై దాడులు చేసిన తర్వాత, ఈడి ఇప్పుడు న్యూస్‌క్లిక్‌పై పడిందని ఐజాక్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

న్యూస్‌క్లిక్‌పై వచ్చిన ఆరోపణ ఏమిటంటే అది విదేశీ డబ్బును అంగీకరించింది. ఏదైనా చట్టవిరుద్ధమైన చర్య జరిగితే, ఖచ్చితంగా దర్యాప్తు చేసి, విచారించండి. కానీ ఇక్కడ అలా జరగలేదు. యుఎపిఎ కింద కేసు నమోదు చేశారు. విభాగాలు ఏమిటి? ముఖ్యమైనది సెక్షన్ 153ఎ. ఇది రెండు సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రేరేపించేందుకు సంబంధించినది. న్యూస్‌క్లిక్‌పై అలాంటి కేసు పెట్టడం బిజెపికే చెల్లింది. ఈ ఆన్‌లైన్ పోర్టల్‌పై నమోదు చేసిన మరో సెక్షన్ 120బి. ఇది నేర పూరిత కుట్రకు సంబంధించినది.

సమాజంలో విభజనకు కుట్ర పన్నింది ఎవరు? తీస్తా సెతల్వాద్, రచయిత్రి గీతా హరిహరన్, న్యూస్‌క్లిక్ కార్యకర్తలు డి రఘునందన్, ప్రబీర్ పుర్కాయస్థ, రచయితలు పరంజోయ్ గుహ ఠాకుర్తా , ఊర్మిళేష్ తదితరులు. వీరిలో, రఘునందన్, ప్రబీర్ 1970ల మధ్యకాలం నుండి సన్నిహిత మిత్రులు.



న్యూస్‌క్లిక్ కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

ఎస్ఎఫ్ఐలోను, తరువాత సైన్స్ ఉద్యమంలోను వీరు కలిసి పనిచేశారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రచారానికి కృషిచేశారు. సమకాలీన వైజ్ఞానిక పరిణామాలను మార్క్సిస్ట్ దక్పథంతో విశ్లేషించడానికి ప్రయత్నించేవారు. ఫ్రీ సాఫ్ట్‌వేర్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా, ఢిల్లీ సైన్స్ ఫోరమ్ మరియు ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ యొక్క ప్రముఖ నాయకులలో ప్రబీర్ పుర్కాయస్థ ఒకరు. ఎమర్జెన్సీ సమయంలో ఏడాదిపాటు జైలు జీవితం గడిపారు. న్యూస్‌క్లిక్‌పై ప్రభుత్వం నిరంతరం దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో గత నెలలో తిరువనంతపురంలో ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమం నిర్వహించిన ఫ్రీడమ్ ఫెస్ట్ సదస్సులో ప్రబీర్ పాల్గొన్నారు.

న్యూస్‌క్లిక్ అనేది రైతుల కార్మికుల సమ్మెలను క్రమం తప్పకుండా కవర్ చేసే మీడియా సంస్థ. 2018లో మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ముంబయి వరకు జరిగిన కిసాన్ లాంగ్ మార్చ్‌ను జాతీయ దష్టికి తీసుకురావడంలో వీరు కీలక పాత్ర పోషించారు. 2020-21లో ఢిల్లీలో ఏడాది పొడవునా రైతుల సమ్మె గురించి అత్యంత ఖచ్చితమైన వార్తలు, విశ్లేషణలు నిరంతరం ప్రచురించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం న్యూస్ క్లిక్‌ను వేటాడడం ప్రారంభించింది.

న్యూస్‌క్లిక్‌పై అనేకసార్లు దాడులు జరిగాయి, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేయబడ్డాయి, కానీ అవేవీ నిరూపించబడలేదు. వీరిద్దరూ అరెస్టు చేసిన ఈ దాడి కేంద్ర ప్రభుత్వ దుష్ట పన్నాగంలో భాగమేనని తెలుస్తోంది. పట్టపగలు 30 కేంద్రాల్లో సమాంతర దాడులు నిర్వహించి, ప్రముఖ జర్నలిస్టులను రహస్య కేంద్రాలకు తీసుకెళ్లి విచారించారు. యుఎపిఎ ప్రయోగించి విమర్శకుల నోర్మూయించడమే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ ఎత్తుగడ.

ప్రజాస్వామ్యం , మీడియా స్వేచ్ఛపై నమ్మకం ఉన్న మిత్రులందరూ సంఘీభావం తెలిపేందుకు ముందుకు రావాలని మనవి.

'ఇండియా' వేదిక ఖండన

న్యూస్ క్లిక్‌పై జరుగుతున్న దాడులు, సోదాలను ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ తరుణంలో మీడియాకు, రాజ్యాంగబద్ధంగా రక్షణ కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు అండగా నిలబడతామని ఆ పార్టీలు ప్రకటించాయి. ఈ మేరకు ఆ పార్టీలు ఒక ప్రకటన జారీ చేశాయి. గత తొమ్మిదేళ్లుగా మీడియాను అణచివేయడానికి దర్యాప్తు సంస్థలను ఉద్దేశ్యపూర్వకంగా మోడీ ప్రభుత్వం దుర్వినియోగపరుస్తోందని విమర్శించాయి. ఆశ్రిత పెట్టుబడిదారులు మీడియా సంస్థలను స్వాధీనం చేసుకోవడానికి వీలు కల్పించడం ద్వారా మీడియాను తన ప్రచార బాకాలుగా మార్చుకునేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఇండియా ఫోరమ్ విమర్శించింది. నిజాలు మాట్లాడే వ్యక్తిగత జర్నలిస్టులపై బిజెపి ప్రభుత్వం, దాని సైద్ధాంతిక సంస్థలు ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించింది. నిష్పక్షపాతంగా రిపోర్టింగ్ చేయకుండా మీడియాను నియంత్రిస్తున్న సమాచార సాంకేతిక నిబంధనలు - 2021 వంటి తిరోగమన విధానాలను తీసుకువస్తోందని ఆ ప్రకటన విమర్శించింది.

జర్నలిస్టు సంఘాల ఖండన

న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, భాషా సింగ్, ఊర్మిళేష్, తీస్తా సెత్వలాద్, అభిసార్ శర్మ, అమిత్ చక్రవర్తి, సుబోధ్ వర్మతో సహా పలువురు జర్నలిస్టుల నివాసాలపై ఢిల్లీ పోలీసులు జరిపిన దాడులను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్, ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్, కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఢిల్లీ శాఖ)లు ఈ మేరకు ఒక ప్రకటన చేశాయి. మీడియా గొంతు నొక్కే ఇటువంటి యత్నాలను సహించబోమని జర్నలిస్టు సంఘాలు పేర్కొన్నాయి. ఒక మీడియా సంస్థకి చెందిన సిబ్బందిని ఇలా మూకుమ్మడిగా బెదిరించడం, దాడి చేయడం ఎక్కడా, ఎప్పుడూ వినలేదని తెలిపాయి. ప్రజల సమస్యల నుండి దృష్టిని మళ్లించేందుకు ఈ దాడులు అని విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వం పాల్పడుతున్న ఈ వేధింపులను నిరసించాల్సిందిగా మీడియా సోదరులకు విజ్ఞప్తి చేశాయి.

న్యూస్ క్లిక్‌పై, జర్నలిస్టులపై దాడులను ది ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) అధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు, వారెంట్ లేకుండా అరెస్టులు చేయడం, దాడులు చేయడం, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను సీజ్ చేయడం జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు.

ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రభుత్వం ఒక ప్రకటన వెలువరించాలని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) డిమాండ్ చేసింది.

ఎన్ఎజె, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ ఖండన

స్వతంత్ర న్యూస్ పోర్టల్ 'న్యూస్ క్లిక్' కార్యాలయాలపై, దానికి వార్తలు రాస్తున్న జర్నలిస్టులు, విశ్లేషకుల ఇళ్లపై ఢిల్లీ పోలీసులు అక్రమంగా జరుపుతున్న దాడులను నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్కాస్టింగ్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) తీవ్రంగా ఖండించాయి. న్యూస్ క్లిక్‌పై బిజెపి ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించాయి. ఉపా చట్టం కింద, నేరపూరిత కుట్రలకు పాల్పడుతున్నట్లు పలు కేసులు పెట్టడం గర్హనీయమని పేర్కొన్నాయి. ప్రభుత్వానికి ఇష్టం లేని వార్తలు ప్రసారం చేస్తున్నందునే ప్రముఖ పాత్రికేయుడు, రచయిత ప్రబీర్ పుర్ణాయస్థ నేతృత్వంలో నడుస్తున్న ఈ పోర్టల్‌పై అతస్య ఆరోపణలు చేస్తూ, అక్రమ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించాయి. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలు, మీడియాపై దాడులు, వేధింపులతో ఇప్పటికే మన దేశం ప్రపంచ పత్రికా స్వాతంత్ర్యంలో అట్టడుగు స్థాయికి చేరిందని గుర్తుచేశాయి. న్యూస్ క్లిక్‌పై దాడి దేశంలో మీడియా స్వేచ్ఛపైనా, ప్రజల భావప్రకటనా స్వేచ్ఛపైనా దాడిగా పేర్కొన్నాయి. జర్నలిస్టుల నుండి స్వాధీనం చేసుకున్న పరికరాలను తక్షణం వారికి అందజేయాలని, అరెస్టులకు పాల్పడవద్దని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎన్ఎజె అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.అమరయ్య, ఎన్.కొండయ్య, ఎపిడబ్లుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎపిబిజెఎ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజు సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ఉపా చట్టం కింద కేసు దారుణం
ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు

ఢిల్లీలో న్యూస్ క్లిక్ జర్నలిస్టులపై ఉప చట్టం కింద కేసులు నమోదు చేయటం పాశవిక చర్యని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్ కృష్ణంరాజు పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడి గర్హనీయమని అన్నారు.

సిఐటియు ఖండన

మోడీ ప్రభుత్వ వినాశకర విధానాలను వ్యతిరేకిస్తున్న వారి గొంతునొక్కేందుకే న్యూస్‌క్లిక్‌పై, జర్నలిస్టులు, ఇతరులపై యుఎపిఎ కింద కేసులు నమోదు చేశారని సిఐటియు విమర్శించింది. ఢిల్లీ పోలీసుల దాడులను తీవ్రంగా ఖండించింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్వేష ప్రసంగాల్లో బిజెపినే ముందు!

- ఎడిఆర్ నివేదిక విడుదల

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 107 మంది ఎమ్మెల్యేలు, ఎంపిలపై ద్వేషపూరిత ప్రసంగాల కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక వెల్లడించింది. విద్వేష ప్రసంగాల్లో బిజెపి ప్రజాప్రతినిధులే అత్యధికులున్నారని పేర్కొంది. మంగళవారం ఈమేరకు నివేదికను విడుదల చేసింది. ఇటువంటి కేసులు ఉన్న 480 మంది గత ఐదేళ్లలో రాష్ట్ర అసెంబ్లీలతోపాటు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసినట్లు తెలిపింది. ఎడిఆర్‌తో పాటు నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఇడబ్ల్యు) సంయుక్తంగా ఈ సర్వే చేపట్టినట్లు తెలిపాయి. ఎంపిలు, ఎమ్మెల్యేలతోపాటు ఆ సమయంలో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు స్వయంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లను అధ్యయనం చేసినట్లు పేర్కొన్నాయి. తమపై విద్వేష ప్రసంగాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు చాలామంది ఎమ్మెల్యేలు, ఎంపిలు స్వయంగా పేర్కొన్నట్లు సర్వే తెలిపింది.

నివేదిక ప్రకారం.. యుపి (ఏడుగురు), తమిళనాడు (నలుగురు), బీహార్, కర్ణాటక, తెలంగాణల నుంచి ముగ్గురు చొప్పున, అస్సాం, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ నుంచి ఇద్దరు చొప్పున, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 33 మంది ఎంపిలపై కేసులు ఉన్నాయి. వీరిలో 22 మంది బిజెపికి, కాంగ్రెస్ (ఇద్దరు), ఆప్, ఎఐఎంఐఎం, ఎఐయుడిఎఫ్, డిఎంకె, ఎండిఎంకె, పిఎంకె, శివసేన (ఉద్ధవ్ థాకరే), విసికె పార్టీల నుండి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ఓ స్వతంత్ర ఎంపిపై కూడా ఈ కేసు ఉన్నట్లు నివేదిక తెలిపింది.

బీహార్, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి తొమ్మిది మంది చొప్పున, ఎపి, మహారాష్ట్ర, తెలంగాణల నుంచి ఆరుగురు చొప్పున, అస్సాం, తమిళనాడు నుంచి ఐదుగురు చొప్పున, ఢిల్లీ, గుజరాత్, పశ్చిమబెంగాల్ నుంచి నలుగురు చొప్పున, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌ల నుంచి ముగ్గురు చొప్పున, కర్ణాటక, పంజాబ్, రాజస్తాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున, త్రిపుర, మధ్యప్రదేశ్, ఒడిశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 74 మంది ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయి. ఈ జాబితాలో బిజెపికి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్ నుంచి 13 మంది, ఆప్ నుంచి ఆరుగురు ఉన్నారు.

బీహార్ కులగణనపై 6న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : బీహార్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఈ నెల 6న విచారిస్తామని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తరపున ఈ కేసులో హాజరవుతున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ఈ నెల 6న విచారణకు లిస్ట్ చేయబడినట్లు పేర్కొంది. ఈ సర్వే చట్టబద్ధతను సమర్థిస్తూ పాట్నా హైకోర్టు ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. దీంతో పిటీషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కుల గణన చేసే అధికారం రాష్ట్రానికి లేదని, ఇది కేంద్రం అధికారాలను లాక్కునే ప్రయత్నమని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు. జనగణన చట్టం 1948ను ఉల్లంఘించడమేనని వాదించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను అప్‌లోడ్ చేయడం, సర్వే నివేదికను వెల్లడించకుండా ఉండటంపై స్టే విధించడానికి గత విచారణలో సుప్రీంకోర్టు తిరస్కరించింది.

నాందేడ్ ఆస్పత్రిలో మరణ మృదంగం

- మూడు రోజుల్లో 31 మంది రోగుల మృతి
- వారిలో 16 మంది చిన్నారులే



నాందేడ్ : మహారాష్ట్రలోని నాందేడ్‌లో గత నెల 30వ తేదీ నుండి మూడు రోజుల వ్యవధిలో 31 మంది రోగులు చనిపోయారు. వీరిలో 16 మంది చిన్నారులే. మందుల కొరత, సకాలంలో వైద్య సాయం అందకపోవడమే దీనికి కారణంగా భావిస్తున్నారు. గత నెల 30 నుంచి ఈ నెల 1వ తేదీ వరకూ 12 మంది పెద్దలు, 12 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోగా సోమవారం రాత్రి ముగ్గురు పెద్దలు, నలుగురు చిన్నారులు చనిపోయారు. రోజుకు సగటున 10 నుండి 14 మంది పిల్లలు చనిపోయారని ఆస్పత్రి రికార్డులను బట్టి తెలుస్తోంది. చనిపోయిన పెద్ద వారిలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారు, కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఉన్నారని శంకర్‌రావ్ చౌహాన్ ప్రభుత్వ ఆస్పత్రి డీన్ ఎస్ఆర్. వాకోడ్ తెలిపారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది 70-80 సంవత్సరాల మధ్యవయస్కులని చెప్పారు. కన్నుమూసిన చిన్నారులలో నలుగురు నెలలు నిండకముందే జన్మించారని వివరించారు.

నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి సమీప జిల్లాల నుండే కాకుండా తెలంగాణ నుండి కూడా రోగులు వస్తుంటారు. ఇటీవల కొందరు సిబ్బందిని వేరే ఆస్పత్రులకు బదిలీ చేశారని, దీంతో సిబ్బంది కొరత ఏర్పడిందని, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడం కష్టమైందని ఆస్పత్రి డీన్ తెలిపారు. దీనికితోడు ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే సంస్థ వాటిని నిలిపివేసిందని చెప్పారు. స్థానికంగా మందులు కొనుగోలు చేసినప్పటికీ అవి సరిపోలేదని అన్నారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. దీనిపై ఓ కమిటీని ఏర్పాటు చేశామని రాష్ట్ర వైద్య విద్యా శాఖ మంత్రి హసన్ ముష్రిఫ్ తెలిపారు.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ నాందేడ్ ఆస్పత్రిని సందర్శించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని చెప్పారు. ఆస్పత్రిలో కేవలం 500 పడకలు మాత్రమే ఉన్నాయని, ప్రస్తుతం 1,200 మంది రోగులను చేర్చుకున్నారని తెలిపారు. చనిపోయిన రోగుల కుటుంబాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. బిజెపికి పేదల ఆరోగ్యం గురించి పట్టింపే లేదని మండిపడ్డారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని ఎన్‌సిపి ఎంపీ సుప్రియా సూలే డిమాండ్ చేశారు. నాందేడ్ ఆస్పత్రిలో మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు, అమ్మకం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, కూలదోయడంతోనే వారు బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ఖల్వాలో థానే మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఛత్రపతి శివాజీ మహరాజ్ స్మారక ఆస్పత్రిలో ఆగస్ట్ 18న 24 గంటల వ్యవధిలోనే 18 మంది రోగులు మరణించిన విషయం తెలిసిందే.

10లోగా దౌత్య సిబ్బందిని వెనక్కి పిలవండి

- కెనడాకు భారత్ అల్టిమేటం!

న్యూఢిల్లీ : భారత్‌లో అదనంగా ఉన్న 41 మంది దౌత్య సిబ్బందిని ఈ నెల 10లోగా వెనక్కి పిలవాలని కెనడాను ఇండియా హెచ్చరించింది. ఖలిస్థానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని ట్రూడో వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ నెల 10లోగా 41 మంది దౌత్య సిబ్బందిని వెనక్కి పిలిపించుకోవాలని భారత్ ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కెనడాలోని భారత దౌత్యసిబ్బంది సంఖ్యతో పోలిస్తే న్యూఢిల్లీలో కెనడా దౌత్య సిబ్బంది సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఆ సంఖ్యను సమస్థాయికి తీసుకురావాలని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసినట్లు జాతీయ మీడియా ఓ కథనంలో పేర్కొంది. ప్రస్తుతం న్యూఢిల్లీలో కెనడాకు చెందిన 62 మంది దౌత్యసిబ్బంది ఉన్నారు. వారిలో 41 మందిని వెనక్కి పిలిపించుకోవాలని చెప్పినట్లు సమాచారం. ఈ నెల 10 దాటిన తర్వాత అదనంగా ఉన్న సిబ్బందికి దౌత్యపరమైన రక్షణను తొలగిస్తామని భారత్ హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ సమాచారంపై కెనడా, భారత్ విదేశాంగ శాఖలు స్పందించాల్సి వుంది.

విద్యార్థికి ఐఐటి బాంబే జరిమానా

- శాకాహారులకు ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటుపై నిరసన ఫలితం

ముంబయి : శాకాహార భోజనం చేసే వారికి ప్రత్యేక టేబుల్స్ ఏర్పాటుచేయడాన్ని వ్యతిరేకించినందుకు ఓ విద్యార్థికి ఐఐటి బాంబే పదివేల రూపాయల జరిమానా విధించింది. మూడు హాస్టళ్లకు చెందిన ఉమ్మడి క్యాంటీన్‌లో మాంసాహారం తినని వారి కోసం ఆరు టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఐఐటి మెస్ కౌన్సిల్ గత వారం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాకాహారులకు కేటాయించిన ఓ టేబుల్‌పై గత నెల 28న కొందరు విద్యార్థులు మాంసాహారాన్ని భుజించారు. తమ నిరసనను ఈ-మెయిల్ రూపంలో అధికారులకు తెలియజేశారు. విద్యార్థుల నిరసనను మెస్ కౌన్సిల్ ప్రస్తావిస్తూ 'ఈ చర్య భోజనశాలలో శాంతియుత వాతావరణానికి, సామరస్యానికి విఘాతం కలిగించేదిగా ఉంది. విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్ సలహాను ధిక్కరించేదిగా ఉంది' అని తెలిపింది. ఇది ఆధునిక కాలంలో అంటరానితనాన్ని ప్రోత్సహించేదిగా ఉన్నదని అంబేద్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ విమర్శించింది. బాంబే ఐఐటిలోని భోజనశాలలో శాఖాహారులకు అనధికారికంగా కొంత ప్రదేశాన్ని కేటాయించడంపై జూలైలోనే వివాదం చెలరేగింది.

మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో

బిజెపి ఎంపి ప్రగ్యా ఠాకూర్ వాంగ్మూలం నమోదు

ముంబయి : మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో బిజెపి ఎంపి ప్రగ్యా ఠాకూర్ వాంగ్మూలాన్ని మంగళవారం నమోదు చేశారు. మంగళవారం ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక కోర్టుకు ఎంపి హాజరయ్యారు. ఎంపికి వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాధారాల ఆధారంగా ప్రశ్నించి, ఎంపితో సహా మరో ఆరుగురి నిందితులు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని మాలెగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబు పేలుళ్లలో ఆరుగురు మరణించారు. వంద మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో ప్రగ్యా ఠాకూర్‌తో పాటు లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్, మేజర్ (రిటైర్ట్) రమేష్ ఉపాధ్యాయ్, సమీర్ కులకర్ణి, అజయ్ రాహిర్‌కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది నిందితులుగా ఉన్నారు. సాక్ష్యాధారాలు ఆధారంగా వీరిని ప్రశ్నించారు. భోపాల్ ఎంపి అయిన ప్రగ్యా ఠాకూర్ ప్రతీ ప్రశ్నకు తనకు తెలియదు అని సమాధానం ఇచ్చారు.

(మొదటి పేజీ తరువాయి)

స్వేచ్ఛకు సంకెళ్లు

డంప్‌లనూ ఎత్తుకెళ్లారు. నిందితులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అందించిన ఇన్‌పుట్‌ల ఆధారంగా ఢిల్లీ పోలీసులు దాడులు నిర్వహించారని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ దాడులను పలు రాజకీయ పార్టీలు, జర్నలిస్టుల, న్యాయవాదుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. స్వతంత్ర మీడియా గొంతునొక్కేందుకు బనాయించిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి.

రాత్రి పొద్దుపోయేదాకా సాగుతున్న దాడులు

. 'న్యూస్‌క్లిక్'కు చెందిన జర్నలిస్టులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారుల ఇళ్లపై మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయేదాకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. యుఎపిఎలోని సెక్షన్153(ఎ) (మతం,జాతి, జన్మ స్థలం, నివాసం ఆధారంగా విభిన్న ప్రజా సమూహాలమధ్య శత్రుత్వం పెంచడం), ఐపిసి 120 (బి)(నేరపూరిత కుట్ర), కింద ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తి తదితరులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కేటాయించిన ఇల్లు -నెం.36 క్యానింగ్ లేన్‌లోనూ ఢిల్లీ పోలీసులు సోదాలు చేశారు. జర్నలిస్టులు అభిసర్ శర్మ, భాషాసింగ్, ఊర్మిళేష్, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్, రచయిత్రి గీతా హరిహరన్, చరిత్రకారుడు సోహైల్ హష్మీ, ఢిల్లీ సైన్స్ ఫోరమ్‌కు చెందిన డాక్టర్ రఘునందన్‌ల ఇళ్లలో ఈ ఉదయం నుంచి సోదాలు జరిగాయి.ముంబయిలో తీస్తా సెతల్వాద్ నివాసంలోనూ పోలీసులు సోదాలు జరిపారు. మార్క్సిస్టు పార్టీ కార్యకర్త శ్రీ నారాయణ్ కుమారుడు న్యూస్‌క్లిక్‌లో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తుండడంతో ఆ నెపంతో ఢిల్లీ పోలీసులు నెంబర్ 36 క్యానింగ్ లేన్‌లోని ఆయన ఇంటిపై దాడి చేశారు. అక్కడే ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యాలయం, కిసాన్‌సభ, ఖేత్ మజ్దూర్, సహమత్ కార్యాలయాలతో బాటు పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలు నివసిస్తున్నారు తన నివాసంలో జరిగిన సోదాలపై ఏచూరి స్పందిస్తూ.. 'న్యూస్‌క్లిక్‌లో పనిచేస్తున్న నా స్నేహితుల్లో ఒకరైన నారాయణ కుమారుడిని విచారించేందుకు పోలీసులు వచ్చారు. అతడి ల్యాప్‌టాప్, ఫోన్‌ను ఎత్తుకెళ్లారు అని మండిపడ్డారు.

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్ ఇప్పటికే వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మే 3న అది విడుదల చేసిన ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత్ 11 స్థానాలు దిగజారింది. 2022లో 150కి, 2023లో 161కి చేరింది. మొత్తం 180 దేశాలతో ఈ జాబితాను రూపొందించారు. ఈ నివేదిక ప్రకారం, భారత మీడియా భద్రతాపరమైన సంక్షోభంలో ఉంది. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియాలో కార్పొరేట్ ఆధిపత్యం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. చాలావరకు ప్రధాన వార్తాపత్రికలు, టీవీ ఛానళ్లు మోడీ ప్రభుత్వానికి బాకాలుగా మారాయి. తమ స్వాతంత్ర్యాన్ని నిలుపుకుని, అధికారం ముందు నిజాలు మాట్లాడే, ప్రభుత్వాన్ని విమర్శించే కొన్ని మీడియా సంస్థలపై అక్రమ కేసులు బనాయించి అణగదొక్కాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 'దేశ వ్యతిరేక శక్తుల' ఆర్థిక సహాయంతో 'దేశభక్తి' ప్రభుత్వాలను గద్దె దింపేందుకు అంతర్జాతీయ స్థాయిలో పన్నిన కుట్రలో భాగంగా' పనిచేస్తున్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తోంది. ఈ క్రమంలోనే చాలా మంది జర్నలిస్టులు, టెలివిజన్ ప్రెజెంటర్లు, యూట్యూబ్‌లో పబ్లిక్ ఎడ్యుకేషనల్ వీడియోలను పెట్టే వారు పోలీసుల వేధింపులకు గురవుతున్నారు. నిఘా అనేది చాలా సాధారణ ప్రక్రియగా మారిపోయింది. సంఘ్ పరివార్‌లోని వివిధ తీవ్రవాద గ్రూపులు కొంతమందిని చంపాలని, నిందితులను ఉరితీయాలని నేరుగా డిమాండ్ చేశాయి. ఈ జాబితాలో జర్నలిస్ట్ రానా అయూబ్, న్యూస్ ఏజెన్సీ 'ఆల్ట్ న్యూస్' హెడ్ మహ్మద్ జుబేర్, స్వతంత్ర పాత్రికేయుడు ఫయే డిసౌజా, బర్ఖాదత్‌లాంటివారు ఉన్నారు,

ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా ఖండన

న్యూస్‌క్లిక్‌తో సంబంధం ఉన్న జర్నలిస్టులు, రచయితల ఇళ్లపై దాడులను ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. మోడీ హయాంలో ప్రజాస్వామ్య మూలస్తంభాలన్నీ దాడికి గురవుతున్నాయని, ఇప్పుడు పత్రికా స్వేచ్ఛకు కూడా ముప్పు వాటిల్లుతోందని పేర్కొంది..

ఐలు ఖండన

జర్నలిస్టులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారుల నివాసాలపై దాడులు చేసిన ఢిల్లీ పోలీసుల చర్యను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఖండించింది. దర్యాప్తు సంస్థలను సాధనాలుగా చేసుకుని అసమ్మతిని, భిన్నాభిప్రాయాలను అణిచివేసేందుకు మోడీ ప్రభుత్వం పన్నిన పన్నాగంలో భాగంగానే ఈ దాడులను చూడాలిని ఐలు కోరింది. జరుగుతున్నాయి.ఈ అప్రజాస్వామిక చర్యకు వ్యతిరేకంగా న్యాయవాదులు ముందుకు రావాలని లాయర్స్ యూనియన్ డిమాండ్ చేసింది.

ఐద్వా ఖండన


ఢిల్లీ, ముంబయిల్లో జర్నలిస్టులు, రచయితలు, మానవ హక్కుల కార్యకర్తల నివాసాలపై జరిగిన దాడులను ఐద్వా తీవ్రంగా ఖండించింది. నిజాన్ని నిర్భయంగా మాట్లాడే, స్వతంత్రులైన జర్నలిస్టులను అడ్డగించడం కోసమే అత్యంత అప్రజాస్వామికమైన, అసమర్థనీయమైన రీతిలో దాడులు జరుపుతున్నారని విమర్శించింది. ఈనాటి దాడులకు లక్ష్యంగా మారిన వారందరికీ ఐద్వా సంఘీభావాన్ని ప్రకటించింది. ఈ ఫాసిస్ట్ ప్రభుత్వం అనుసరించే అక్రమ, అణచివేత చర్యలను ఖండించడానికి ప్రజాస్వామ్య పౌరులందరూ ముందుకు రావాలని ఐద్వా విజ్ఞప్తి చేసింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.



మీకోసం
డబ్బాల్లో పిండి నింపేటప్పుడు గాలి చొరబడకుండా అదిమి పెట్టుకుంటే పురుగు పట్టకుండా ఉంటుంది.

జీవన సౌరభం
విజయవంతమైన ప్రతి వ్యక్తి వెనుక నిరంతర కృషి, అంకితభావం ఉంటాయి.

లెక్కల కిటుకు



అంకెలమండీ అంకెలం
చిక్కులు విప్పే అంకెలం
లెక్కలు చెప్పే అంకెలం
యుక్తిని గొలిపే అంకెలం

అంకెలలోని లింకులన్నీ
శంకలు లేక తెలిపెదమండీ
గణితంలోని ప్రక్రియలన్నీ
గమ్మత్తుగా చేసేదమండీ

(+) గుర్తుతో బంధనమండీ
అంకెకు అంకె కలపడమండీ
కూడిక ఫలితం మొత్తమండీ
సంకలనమని అంటారండీ.


(−) గుర్తు మధ్యన ఉంటే
తీసివేయుట చేయాలండీ
దీని ఫలితమే బేధమండీ
వ్యవకలనమని అంటారండీ

గుణ్యము,
గుణకము (×) తో
లబ్ధమునే సాధించెదమండీ
గుణకారమని పిలిచెదరండీ
హెచ్చువేతని అంటారండీ..

(÷) భాగహారమే నా పేరండీ
భాగాలను చేయుదునండీ
కష్టం కష్టం అంటారండీ
ఇష్టం ఉంటే వశమగునండీ !

– మీసాల చిన గౌరినాయుడు
94928 48564

లెక్క చేయండి



పిల్లలూ, ఇక్కడ ఉన్న బొమ్మలను అంకెలుగా గణించి సమాధానాలు ఇచ్చాం. క్లూ ఆధారంగా చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ






ఎన్.నాగమ్మ,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొండకోనల్లో అక్షర దీపం



వారంతా అడవి బిడ్డలు.. బయట ప్రపంచం తెలియని చిన్నారులు... అడవుల్లో దొరికే గడ్డలు, కందలు, సహజసిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకుంటారు. తమ తల్లిదండ్రుల మాదిరిగా వేటాడుతూ జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇంత పురోగతి సాగిస్తున్నా కొండకోనల్లో ఉండే గిరిజనం (ఆదివాసీలు) పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసిన ఓ 37 సంవత్సరాల వ్యక్తి మార్పుకోసం తనవంతుగా కృషిచేశాడు. వారికి చదువు నేర్పించి మెరుగైన జీవితం పొందటానికి తోడ్పడుతున్నాడు. కొండకోనల్లో అక్షర దీపం వెలిగిస్తున్న అతడు తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ జిల్లాకు చెందిన సతీష్. అతడి కృషి గురించే ఈ కథనం ...

తమిళనాడులోని ఈరోడ్ జిల్లాలో సత్యమంగళం ప్రాంతంలో ఎక్కువమంది గిరిజన ప్రజలు నివసిస్తున్నారు. వారంతా నిరక్షరాస్యులు. అడవిలో లభించే పండ్లు, దుంపలు వంటివి తిని బతుకుతున్నారు. పాఠశాలలు సమీప ప్రాంతాల్లో లేకపోవటంతో పిల్లలు కూడా బాలకార్మికులుగానే మిగిలిపోతున్నారు. సత్యమంగళం పట్టణంలో సతీష్ కుటుంబం నివసిస్తోంది. సతీష్‌కి తల్లిదండ్రులు, భార్య, పిల్లలూ ఉన్నారు. తమకున్న ఐదెకరాల పొలంలో పూలసాగు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబం ముందుకు సాగుతోంది. సతీష్ 2014 నాటికి పీజీ, బీఈడీ పూర్తిచేశాడు. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నాడు. సత్యమంగళంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరాడు. ఆ విధుల్లో భాగంగా ఒకసారి గుండ్రి అనే కొండ గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. ఎలాంటి రవాణా సదుపాయమూ లేకపోవటంతో కాలినడకనే చేరుకున్నాడు. ఈ ఊళ్లో బడిఈడు పిల్లలంతా ఒంటిపై చిన్నపాటి పీలికలు మాత్రమే ధరించి, జుత్తు పెరిగిపోయి, కాళ్లకు చెప్పులు కూడా లేకుండా తిరుగుతుండటం గమనించాడు. చాలామంది పిల్లలు కల్లు సేవించి కూని రాగాలతో తూగుతుండడం అతడిని కలవరపరిచింది.

గుంపుగా ఆడుకుంటున్న పిల్లలను పిలిచి వారితో మాట్లాడాడు. వారి అమాయకపు మాటలు, హావభావాలు సతీష్‌లో చాలా ఆవేదన కలిగించాయి. బడికెళ్లాల్సిన బాల్యం ఇలా సమాధి అయిపోతుందే అని బాధపడ్డాడు. "నేను చదువు చెబుతా... చదువుకుంటారా?" అని అడిగాడు. పిల్లలు సరే అన్నారు. ఆ తరువాత ఆ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడే ప్రయత్నం చేశాడు. చదువు నేర్పుతానంటే వారు వద్దంటారా? పూర్తిగా అర్థం కాకపోయినా, అది తమ మంచి కొరకే అనుకున్నారు.

కానీ, ఆ చదువు చెప్పటం సతీష్‌కే కష్టం. ఎందుకంటే– కొండవాలు గ్రామాలకు వచ్చి వెళ్లాలంటే చాలా కష్టం. అడవి, కొండలు, గుట్టలు, వాగులు దాటుకుని నడవాలి. వర్షాకాలమైతే ప్రయాణం మరింత దుర్లభం! అయినా, అతడు వెనుకంజ వేయలేదు. గిరిజన బిడ్డల కోసం తన ప్రయివేటు ఉద్యోగాన్ని వదులుకున్నాడు. 'ట్రీ పీపుల్ చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించాడు. ఇటు వ్యవసాయ పనుల్లో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూనే కొండగ్రామాలకు వెళ్లి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే కృషి ప్రారంభించాడు.

సతీష్ ప్రతిరోజూ ఉదయాన్నే లేచి పూలుకోసి ఇంటికి తెస్తాడు. వాటిని కుటుంబ సభ్యులు మార్కెట్‌కు తీసుకెళతారు. అప్పుడు సతీష్ అడవి బాట పడతాడు.

గుండ్రి, కడంపూర్, తాళవడి, బర్గూర్ గిరిజన గ్రామాల్లో బడి ఈడు పిల్లలు ఎక్కువగా ఉన్నారు. ఆ గ్రామాలన్నీ దగ్గర దగ్గరగానే ఉంటాయి. ఏ ఊరు కేంద్రంగా బడిని నడపాలో మొదట్లో అర్థం కాలేదు. అన్ని గ్రామాలకు వెళ్లి కొంత కొంత సేపు చదువు చెప్పటం మొదలెట్టాడు. ఇదే సమయంలో ఆయనకు ఓ ఎన్‌జిఒ సంస్థ ప్రతినిధులు పరిచయమయ్యారు. సతీష్ చేస్తున్న సేవలను తెలుసుకొని ప్రోత్సాహం అందించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించటానికి కొంత దోహదపడ్డారు.




సతీష్ కొన్ని రోజులు ఆయా గ్రామాల్లో ఉంటూ పిల్లలకు చదువు చెప్పేవాడు. మొదట్లో చెట్టుకిందనే విద్యా బోధన సాగేది. ఎలాగైనా పాఠశాల భవనాన్ని నిర్మించాలని అనుకున్నాక– గ్రామ పంచాయతీ 10 సెంట్ల స్థలాన్ని అందుకు కేటాయించింది. సతీష్ తన కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి రూ.1.50 లక్షలతో పాఠశాలకు పునాదిని నిర్మించాడు. ఓ ప్రయివేటు విద్యాసంస్థ కొంత ఆర్థిక సహాయం చేసింది. దాంతో, భవన నిర్మాణం పూర్తయింది. 2020లో పాఠశాల ప్రారంభం కాగా, మొదటి ఏడాది 70 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఎన్‌సిఎల్‌పి పథకం ద్వారా ప్రభుత్వం ముగ్గురు ఉపాధ్యాయులను నియమించింది. వారికి నెలకు రూ.7500 ఇచ్చేలా నియామకం చేసింది. సజావుగా నడుస్తున్న క్రమంలో 2022, మార్చిలో ఎన్‌సిఎల్‌పి పథకాన్ని కేంద్రప్రభుత్వం నిలిపేసింది. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ పాఠశాలలో పిల్లలను చేర్పించాడు సతీష్. దూరాభారం వల్ల చాలామంది పిల్లలు పాఠశాలకు స్వస్తి పలికారు. ఈ పరిస్థితిని గమనించిన సతీష్ తిరిగి పాత ప్రాంతంలోనే సాయంత్రం తరగతులను ప్రారంభించారు. నెలకు రూ.5000 ఇచ్చి జీతంపై పనిచేయటానికి డిగ్రీ చదివిన వ్యక్తిని సహకారిగా నియమించారు. ప్రస్తుతం 42 మంది ట్యూషన్‌కు హాజరవుతున్నారు. అన్ని కొండ గ్రామాలకు ఈ సాయంత్రం తరగతులను విస్తరించటమే తన లక్ష్యమని సతీష్ చెబుతున్నాడు. 200 మందికిపైగా పాఠశాల నుంచి డ్రాపౌట్స్ ఉన్నారనీ, వారందరికీ తిరిగి పాఠశాలలో చేర్పించటమే తన లక్ష్యమని చెబుతున్నాడు. తాను ప్రోత్సహించిన వారిలో ఇప్పుడు పదిమంది వరకూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, అదే తనకు గర్వకారణమని సంతోష్ అంటున్నాడు. ఆ యువకుడి కృషికి ప్రభుత్వ సహాయం అందాలి. ఆ కొండల్లో అక్షర దీపం వెలగాలి!

ఆరోగ్యానికి జీడిపప్పు



జీడిపండ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జీడిపప్పు ప్రయోజనాలైతే అమోఘం అనే చెప్పాలి. జీడిపప్పుల్లో మాంసకృత్తులు, విటమిన్ ఇ, విటమిన్ కె, విటమిన్ బి6, కొవ్వు పదార్థాలు, ఖనిజాలు, లవణాలు, కాల్షియం, జింక్, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, మాంగనీస్, సెలీనియం పుష్కలంగా ఉన్నాయి. జీడిపప్పుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఇమ్యూనిటీ పవర్‌ను పెంచేందుకు ఎంతో సహాయపడతాయి. రోజు తాము తినే ఆహారంలో కొన్ని జీడిపప్పులను తీసుకుంటే అధిక బరువును కూడా తగ్గించుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఉడికించిన మాంసంలో ఉండే స్థాయిలో జీడిపప్పుల్లో ప్రోటీన్లు ఉంటాయి. మాంగనీస్, మెగ్నీషియం ఎక్కువ మొత్తంలో ఉండటం వల్ల కండరాలు ఆరోగ్యంగా, బలంగా తయారవుతాయి. జీడిపప్పులను పచ్చివిగానే తిన్నా లేదా వేయించుకుని తిన్నా చాలా త్వరగా అరుగుతాయి. టైప్ 1, టైప్ 2 డయాబెటీస్ పేషెంట్లకు ఇవి ఎంతో మేలు చేస్తాయి.

రజినీ సినిమాలో రానా



రజినీకాంత్, టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రాబోతోన్న సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటూ ఉంది. త్వరలో సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ కూడా భాగం కానున్నట్లు గతంలోనే ప్రకటించారు. 'తలైవర్ 170' అనే వర్కింగ్ టైటిల్‌తో లైకా ప్రొడక్షన్స్ నుంచి ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తాజా అప్డేట్ ప్రకారం రానా దగ్గుబాటి ఈ సినిమాలో నటిస్తున్నారు. అమితాబ్–రజినీకాంత్‌కి విలన్‌గా రానా నటిస్తున్నాడనే టాక్ కోలీవుడ్ ఇండస్ట్రీలో ఉంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టనున్నారు. చెన్నైలో వేసిన భారీ సెట్‌లో ఈ షూటింగ్ స్టార్ట్ చేయనున్నారని సమాచారం. ఈ సినిమాలో రజినీకాంత్ ఒక ఎంకౌంటర్‌లో సస్పెండ్ అయిన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు.



6న 'హాయ్ నాన్న' సెకండ్ సింగిల్

నాని తాజా చిత్రం 'హాయ్ నాన్న' సెకండ్ సింగిల్ త్వరలో రానుంది. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ చిత్రంలో నాని కూతురుగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం నుండి 'సమయమా' అంటూ సాగే మొదటి పాటను ఇదివరకే విడుదల చేశారు. తాజాగా 'గాజు బొమ్మ' అంటూ సాగే పాటను అక్టోబర్ 6న విడుదల చేయబోతున్నట్లుగా నాని ఓ వీడియో సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. ఈ వీడియోలో నాని, కియారా ఖన్నా ముచ్చటగా మాట్లాడుకుంటూ.. గాజు బొమ్మ పాటను అనౌన్స్ చేశారు. తండ్రి కూతురు నేపథ్యంలోని ఈ పాట 'హాయ్ నాన్న' సోల్‌గా ఉండబోతోంది.

'మ్యాడ్' ట్రైలర్‌ను విడుదల చేసిన ఎన్టీఆర్




నితిన్ నార్నె హీరోగా 'మ్యాడ్' సినిమా ఈనెల ఆరోతేదీన విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో జూనియర్ ఎన్టీఆర్ మంగళవారం విడుదల చేశారు. నితిన్ జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి సోదరుడు. సంగీత్ శోభన్, రామ్‌నితిన్, శ్రీ గౌరీప్రియారెడ్డి, అనంతిక శనిల్ కుమార్, గోపిక ఉదయన్ ముఖ్యపాత్రలు పోషించారు. రఘుబాబు, రచ్చరవి, మురళీధర్ గౌడ్, విష్ణు, ఆంటోనీ, శ్రీకాంత్‌రెడ్డి కూడా నటిస్తున్నారు. దర్శకుడు అనుదీప్ ఇందులో ఓ ముఖ్య పాత్రను పోషించారు. రచన, దర్శకత్వం కళ్యాణ్ సుంకర. ఈనెల ఆరోతేదీన ఈ సినిమా విడుదల కానుందని నిర్మాతలు ప్రకటించారు.

తెలంగాణా యాస రాదని వద్దన్నారు : హరితేజ



'శేఖర్ కమ్ముల గారు మిమ్మల్ని చూడగానే ఒకటి గుర్తొచ్చింది.. నేను ఎలాగైనా మీ దర్శకత్వంలో సినిమా చేయాలని రెండు మూడు సార్లు వచ్చి ఆడిషన్ ఇచ్చాను. కానీ అప్పుడు నేను ఎందుకు రిజెక్ట్ అయ్యానో తెలుసా.. తెలంగాణ యాస రాలేదని' అంటూ నటి హరితేజ వెల్లడించారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫిదా' సినిమా ఎంత పెద్ద విజయం అందుకుందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో సాయిపల్లవి అక్క పాత్రను శరణ్య ప్రదీప్ పోషించారు. అయితే, ఈ పాత్ర కోసం నటి హరితేజ ఆడిషన్‌కు వెళ్లారట. 'మామా మశ్చీంద్ర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. సుధీర్ బాబు త్రిపాత్రాభినయంలో హర్షవర్ధన్ తెరకెక్కించిన 'మామా మశ్చీంద్ర'లో హరితేజ కీలక పాత్ర పోషించారు. ఈనెల ఆరోతేదీన ఈ సినిమా విడుదలకానుంది. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోలు విశ్వక్ సేన్, శర్వానంద్, దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

'తెలుగులో ఎవరు చూస్తారు' అన్నారు...



'తమిళనాడులో రెడ్ జెయింట్ వాళ్ళు నా సినిమా చూసి ఇలాంటి గొప్ప సినిమా చూడలేదని కొన్నారు. కేరళలో నిర్మాత గోకులం గోపాలం, కర్ణాటకలో కేజీఎఫ్ సినిమా నిర్మాతలు చూసి డిస్ట్రిబ్యూషన్ తీసుకున్నారు. కానీ తెలుగు విషయానికి వస్తే సిద్ధార్థ్ సినిమా ఎవరు చూస్తారు అని అడిగారు. నేను ఒక మంచి సినిమా చూస్తే ప్రేక్షకులు చూస్తారని నేను చెప్పాను. మళ్ళీ చెప్తున్నా, ఇది 28న రిలీజ్ కావాల్సిన సినిమా' అని 'చిత్తా' తెలుగు వర్షన్ లాంచింగ్ ప్రెస్‌మీట్‌లో హీరో సిద్ధార్థ్ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎవరూ చూడరని నాకు థియేటర్లు దొరకలేదు. ఈ సినిమా కంటే మంచి సినిమా నేను తీయలేను. దయచేసి సినిమా థియేటర్లకు వచ్చి సినిమా చూడండ'ని ఆయన అభిమానులను కోరారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిత్త' తమిళనాడు, కర్నాటక, మలయాళ రాష్ట్రాల్లో రిలీజ్ చేశారు. సెప్టెంబర్ 28న విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ప్రతి తల్లిదండ్రులు తప్పక చూడాల్సిన సినిమా ఇదని కొనియాడారు. ఈ సినిమాను అప్పుడే తెలుగులో కూడా రిలీజ్ చేయాలనుకున్నా ఎవరూ కొనకపోవడంతో ఈ వారం రిలీజ్ చేస్తున్నారు.

కోలీవుడ్ నిర్మాత విఎ దురై మృతి



కోలీవుడ్‌కు చెందిన ప్రముఖ నిర్మాత వీఏ దురై (59) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం అర్ధరాత్రి చెన్నైలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. రజనీకాంత్, విజయకాంత్, విక్రమ్, సూర్య, సత్యరాజ్ వంటి హీరోలతో ఆయన సినిమాలు తీశారు. గజేంద్ర చిత్రం తర్వాత దురై సినిమాలకు దూరమయ్యారు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని ఓ వీడియో విడుదల చేయడంతో హీరో సూర్య ఇటీవల సహాయం చేశారు. దురై మృతునికి కోలీవుడ్ ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.

అనూ, పారుల్‌కు స్వర్ణాలు

- లౌల్లీనాకు ఒలింపిక్ బెర్త్
- భారత్ ఖాతాలో మరో తొమ్మిది
- అత్యధిక పతకాలు ఖాయం



అఫ్సల్ (800మీ. రన్ రజతం)



శంకర్ డెకథ్లాన్ రజతం

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల హవా కొనసాగుతోంది. మంగళవారం జరిగిన 5వేల మీ. పరుగులో పారుల్ చౌదరి, జావెలిన్ త్రోలో అన్నురాణి స్వర్ణ పతకాలను సాధించారు. ముఖ్యంగా 5వేల మీ. పరుగులో పారుల్ చౌదరి నయా చరిత్ర లిఖించింది. ఈ పరుగును 15నిమిషాల 14.75 సెకన్లలో పూర్తి చేసిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా రికార్డుపుటల్లోకెక్కింది. ఇక హిరోనికా రిరికా(జపాన్) 15 నిమిషాల 15.34సెకన్లు, కిప్కిరుయ్ కరోలిన్ చెప్‌కోయిచ్(కజకిస్తాన్) 15నిమిషాల 23.12 సెకన్లలో రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు. పారుల్ చౌదరికి ఆసియా క్రీడల్లో ఇది రెండో పతకం. సోమవారం జరిగిన 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో పారుల్ చౌదరి రజత పతకం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక మహిళల జావెలిన్ త్రో ఫైనల్లో అన్నురాణి బంగారు పతకాన్ని ముద్దాడింది. అన్ను రాణి 4వ ప్రయత్నంలో జావెలిన్‌ను 62.93మీ. విసిరి ప్రథమస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో నదీషా దిల్హాన్(శ్రీలంక) రజత పతకం కైవసం చేసుకుంది.

తేజశ్విని శంకర్‌కు రజతం..

డెకథ్లాన్‌లో తేజశ్విని శంకర్ జాతీయ రికార్డును నెలకొల్పి రజత పతకం సాధించాడు. పురుషుల డెకథ్లాన్ ఫైనల్లో తేజశ్విని1500మీ. పరుగులో నాల్గో స్థానంతో మొత్తం 7,666పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కడం 1974తర్వాత ఇదే తొలిసారి. అప్పట్లో విజయ్ సింగ్ చౌహాన్ 7,659పాయింట్లతో జాతీయ రికార్డును నెలకొల్పాడు.

800మీ. పరుగులు మహ్మద్ అఫ్సల్ రజత పతకం సాధించాడు. ఈ పరుగులును ఒక నిమిషం 48.43సెకన్లతో రెండోస్థానంలో నిలిచాడు. సౌదీ అరేబియాకు చెందిన ఎస్సా అలీకి స్వర్ణ పతకం దక్కింది. భారత్‌కే చెందిన కిషన్ కుమార్ ఐదోస్థానంలో నిలిచాడు.

ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్ కాంస్య పతకం సాధించాడు. మొత్తం ఆరు ప్రయత్నాల్లో భాగంగా తొలి ప్రయత్నంలో 16.68మీటర్లు జంప్ చేసి మూడోస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన అబుబకర్ 16.62మీ. నాల్గోస్థానానికే పరిమితమయ్యాడు.

పురుషుల 92కిలోలకు పైబడిన విభాగంలో నరేంద్ర కాంస్య పతకానికే పరిమితమయ్యాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్లో నరేంద్ర ఐదురౌండ్ల ఉత్కంఠ పోటీలో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, కజకిస్తాన్‌కు చెందిన కంషేబెక్ చేతిలో 0–5పాయింట్లతో ఓటమిపాలయ్యాడు.

లౌల్లీనాకు ఒలింపిక్స్ బెర్త్..

బాక్సింగ్‌లో మహిళల 75 కేజీల విభాగంలో ఫైనల్లోకి చేరి లౌల్లీనా బోర్గోహైన్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో గెలిచి ఫైనల్‌కు చేరడంతోపాటు పతకం ఖాయం చేసుకుంది. అలాగే వ్యక్తిగత ఆర్చరీ విభాగంలోనూ జ్యోతి సురేఖ వెన్నం కూడా ఫైనల్‌లో అడుగుపెట్టింది. భారత ఆర్చరీ అభిషేక్ వర్మ, ఓజాస్‌తో కూడిన పురుషుల జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఫైనల్స్ అక్టోబర్ 7న జరగనుంది. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్‌లోనూ అశ్విని పొన్నప్ప–తనీషా కాస్ట్రో రెండో రౌండ్‌లోకి చేరారు. కబడ్డీ మహిళల జట్టు, దక్షిణ కొరియాపై 56–23 పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మంగళవారం పోటీలు ముగిసే సరికి భారత్ 69 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

సెమీస్‌కు టీమిండియా..
నేపాల్‌పై 23 పరుగుల తేడాతో గెలుపు

పురుషుల క్రికెట్‌లో భారతజట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం నేపాల్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా 23పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. యశస్వి(100) సెంచరీ సాధించాడు. ఛేదనలో నేపాల్ కూడా దూకుడుగానే ఆడి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 179 పరుగులకే పరిమితమైంది.

శతకం బాదేసిన యశస్వి

భారత ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్ (25), యశస్వి జైస్వాల్ అదరగొట్టారు. తొలి వికెట్‌కు శతక(103) భాగస్వామ్యం నిర్మించారు. యశస్వివే అత్యధికం కావడం విశేషం. కానీ, నేపాల్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులను సంధించడంతో పరుగుల వేగం మందగించింది. స్వల్ప వ్యవధిలో రుతురాజ్, తిలక్ (2), జితేశ్ శర్మ (5) వికెట్లు పడ్డాయి. మరో వైపు యశస్వి మాత్రం తన దూకుడు తగ్గించలేదు. క్రీజ్‌లో పాతుకుపోయి దూకుడుగా ఆడాడు. అంతర్జాతీయ టీ20ల్లో తొలి సెంచరీ నమోదు చేశాడు. ఆ వెంటనే పెవిలియన్‌కు చేరాడు. అయితే, చివర్లో శివమ్ దూబెతో (25లి)తో కలిసి రింకు సింగ్ (37నాటౌట్) చెలరేగిపోయాడు.

భారత్ X నెదర్లాండ్స్ వార్మప్ మ్యాచ్ రద్దు



తిరువనంతపురం: భారత్–నెదర్లాండ్స్ జట్ల మధ్య జరగాల్సిన వార్మప్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. ప్రపంచకప్ ముంగిట నిర్వహిస్తున్న వార్మప్ మ్యాచ్‌లకు వరుణుడు ఆటంకం కలిగిస్తున్నాడు. వర్షం అంతరాయం కారణంగా ఒక్క బంతి పడకుండానే మ్యాచ్‌లు రద్దవుతున్నాయి. కనీసం టాస్ పడకుండానే ఈ మ్యాచ్ రద్దయింది. దీంతో టీమిండియా వన్డే ప్రపంచకప్‌కు ముందు ఆడాల్సిన రెండు సన్నాహక మ్యాచ్‌లు వర్షార్పణం అయినట్లయింది. ఇక 5న ఇంగ్లండ్–న్యూజిలాండ్ మధ్య జరిగే మ్యాచ్‌తో ఐసిసి వన్డే ప్రపంచకప్ ప్రారంభం కానుంది. భారతజట్టు తన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో 8న చెన్నైలో తలపడనుంది.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	161	90	46	297
2.	జపాన్	33	47	50	130
3.	ద.కొరియా	32	42	65	139
4.	ఇండియా	15	26	28	69
6.	ఉజ్బెకిస్తాన్	14	15	21	50
5.	చైనీస్ తైపీ	12	10	18	40
7.	థాయ్‌లాండ్	10	11	19	40
8.	ఉ.కొరియా	7	10	6	23
9.	బహ్రెయిన్	7	1	4	12
9.	హాంకాంగ్	6	15	24	45

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68